

- రూ.3 వేల కోట్లతో అతిపెద్ద పర్యాటక కేంద్రం
- తుది మెరుగుల్లో ఎన్టీఆర్ స్మారకం డీపీఆర్

రాజధానిలో.. ఠీవీగా ఎన్టీఆర్

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

రాజధాని అమరావతిలో నీరుకొండపై ఎన్టీఆర్ విగ్రహాన్ని నిర్మించాలని గత టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. పదేళ్లనాటి ఈ కలను సాకారం చేయాలని ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదలగా ఉన్నారు. దీనికి సంబంధించి డీపీఆర్ కూడా దాదాపు సిద్ధమైంది. గత మేలో షెలాడి అసోసియేట్స్ అనే కంపెనీకి డీపీఆర్ తయారీ బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కార్పొరేషన్ అప్పగించింది. కాగా ఈ కంపెనీ రూపొందించిన విగ్రహ నమూనాలను ఇటీవల చంద్రబాబు పరిశీలించారు. రాజధాని పరిధిలోని నీరుకొండ 169 ఎకరాల్లో విస్తరించి సుమారు 300 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఈ కొండ శిఖరంపైన సుమారు 14 ఎకరాలను చదును చేసి ప్రాజెక్టు నిర్మాణానికి అనువుగా తయారుచేయనున్నారు. ఇక్కడ ముందుగా వంద అడుగుల ఎత్తులో బేస్ నిర్మాణాన్ని చేపట్టి దానిపై మరో 200 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. అపుడు కొండ పీఠభాగం నుంచి మొత్తం ఎత్తు ఆరొందల అడుగులుగా ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు. ప్రభుత్వం నిర్మించనున్న గవర్నమెంట్ కాంప్లెక్సులో ఓ చివర నుంచి సీఎం నివాసం, రాజ్‌భవన్, సెక్రటేరియేట్, అసెంబ్లీ భవనాలు రానుండగా అదే వరుసలో ఇటు చివరన నీరుకొండ శిఖరంపై ఎన్టీఆర్ విగ్రహం వస్తుంది. మొత్తంగా చూస్తే కొండపై నుంచి ఎన్టీఆర్ విగ్రహం ఉత్తరాభిముఖంగా ఉండి రాజధాని మొత్తాన్ని చూస్తున్నట్టుగా దృశ్యభావన కలుగుతుంది.

ప్రాజెక్టుపై సమగ్ర అధ్యయనం

ఎన్టీఆర్ మెమోరియల్ ప్రాజెక్టును సాదాసీదాగా కాకుండా నిర్వహణ భారం కానివిధంగా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంది. విజయవాడ స్వరాజ్ మైదాన్‌లో గత వైసీపీ ప్రభుత్వం నిర్మించిన డాక్టర్ అంబేద్కర్ మెమోరియల్ ప్రాజెక్టు అసంపూర్ణంగా ఉండి విజయవాడ నగరపాలకసంస్థకు నిర్వహణభారంగా మారింది. దీనిని దృష్టిలో ఉంచుకునే ఎన్టీఆర్ ప్రాజెక్టును సమగ్రంగా చేపట్టి భవిష్యత్తులో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తకుండా పర్యాటక, వాణిజ్య పరమైన అంశాలను కూడా జోడిస్తున్నారు. ఆ దిశగా ఇప్పటికే విజయవంతంగా, పర్యాటకులను ఆకట్టుకునేలా (మిగతా 6లో)


ఎన్టీఆర్ విగ్రహ ఆకృతులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు (పాతచిత్రం)

స్టాచ్యూ ఆఫ్ యూనిటీ స్ఫూర్తిగా...

గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో స్టాచ్యూ ఆఫ్ యూనిటీ (సర్దార్ వల్లభాయ్‌పటేల్) విగ్రహ నమూనాను స్ఫూర్తిగా తీసుకుని నీరుకొండపై ఎన్టీఆర్ మెమోరియల్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని గతంలో రూ.450 కోట్లతో వంద అడుగుల ఎత్తులో నిర్మించాలని భావించింది. అయితే అమరావతిలో ఈ ప్రాజెక్టు అత్యున్నతంగా ఉండాల న్న ఆలోచనతో విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఎన్టీఆర్ విగ్రహాన్ని సుమారు 600 అడుగుల ఎత్తులో నిర్మించేలా డిజైన్‌లో మార్పు చేశారు.


నీరుకొండపై ఎన్టీఆర్ విగ్రహం నమూనా

రాజధానిలో స్వర్గీయ నందమూరి తారక రామారావు నిలువెత్తు విగ్రహం ఠీవీగా ఉండనున్నది. అమరావతి ఖ్యాతిని.. విశిష్టతను పెంచేరీతిగా.. తెలుగుజాతి గౌరవాన్ని ప్రపంచం నలుదిశలా చాటేలా.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ స్మారక ప్రాజెక్టును చేపట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ఎన్టీఆర్ మెమోరియల్ ప్రాజెక్టు పేరుతో రాజధాని అమరావతిలోని నీరుకొండపై దేశంలోనే అత్యంత పెద్దదైన ఎన్టీఆర్ భారీ విగ్రహాన్ని నెలకొల్పనున్నది. రూ.3 వేల కోట్లతో దీనిని నభూతో నభవిష్యత్ అన్నచందంగా పెద్దఎత్తున అభివృద్ధి చేయనున్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా ఎన్టీఆర్ విగ్రహం నీరుకొండ కొండపై చాలా ఠీవిగా నిలబడనుంది. రాజధాని పరిధిలో శాఖమూరు సెంట్రల్‌పార్కు, రివర్ ఫ్రంట్, ఎన్టీఆర్ మెమోరియల్ ప్రాజెక్టులు పర్యాటకులను ఆకట్టుకునే విధంగా నిర్మిస్తున్నారు.


గుంటూరు : పట్టాభిపురం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారు

దసరాకు ఆరు ప్రత్యేక రైళ్లు | నేడు ఛాంబర్ ఆఫ్ కామర్స్.. ఎన్నికలు | 6 | చదరంగంలో ప్రతి క్షణం విలువైనదే! -కోనేరు హంపి

లారీ సంఘంలో పునః ప్రవేశం

- కిరాయిపై తలదూర్చమని తొలుత వాగ్దానం
- మూడు రోజుల్లో మాట మార్చి ధరల పట్టిక జారీ
- అసోసియేషన్ నిర్ణయంపై ఎగుమతిదారుల అభ్యంతరం



గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో మిర్చి ఎగుమతుల విషయంలో లారీ యజమానుల సంఘం ప్రమేయానికి అడ్డుకట్ట పడటంతో తొమ్మిది నెలల నుంచి ఎక్స్‌పోర్టులు సాఫీగా జరిగిపోతున్నాయి. తెలంగాణలోని మార్కెట్ కమిటీలతో సమానంగా ఇక్కడ కూడా లారీ కిరాయిలు దిగి రావడంతో బయ్యర్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచే కొనుగోళ్లు జరుపుతున్నారు. ఈ కారణంగా అన్‌సీజన్ అయిన జూన్ రెండో వారం నుంచి ఇప్పటి వరకు గత ఏడాదితో పోల్చితే 8 లక్షల మిర్చి టిక్కీలు అదనంగా విక్రయం జరిగాయని ఎక్స్‌పోర్టర్లు తెలిపారు. సజావుగా జరుగుతున్న తరుణంలో మూడు రోజుల క్రితం మళ్లీ లారీ యజమానుల సంఘాన్ని తెరిచి తమ ద్వారానే ఎక్స్‌పోర్టు లారీలు కిరాయికి పెట్టుకోవాలని ప్రకటించారు. కిరాయి విషయంలో తలదూర్చబోమని చెప్పి హఠాత్తుగా కిరాయిలు నిర్ణయించడంపై మిర్చి ఎగుమతిదారులు అభ్యంతరం వ్యక్తం చేస్తోన్నారు. వైసీపీ హయాంలో లారీ యజమానుల సంఘం పేరుతో చేసిన దందా అంతా ఇంతా కాదు. ఎగుమతిదారుడు ఎవరైనా సరే ఒక్కో లారీకి రూ.4 వేలు కమీషన్ తీసుకుని అసోసియేషన్‌కు చెప్పాలి. అప్పుడు ఆ సంఘం నాయకులు సీరియల్ పేరుతో ఎవరో ఒక లారీ యజమానికి చెప్పి లారీని పెట్టించేవారు. అలానే అసోసియేషన్‌లో సభ్యత్వం పేరుతో లారీ యజమానుల వద్ద డబ్బులు వసూలు చేసేవారు. ఈ కారణంగా ఖమ్మం, వరంగల్ ఏఎంసీలతో పోల్చితే ఇక్కడ కిరాయి దాదాపు రూ.30 వేలకు పైగా వ్యత్యాసం ఉందని వ్యాపారులు వాపోతుండేవారు. ఈ కారణంగా చాలామంది బయ్యర్లు గుంటూరు నుంచి తెలంగాణలోని ఏఎంసీలకు వెళ్లి అక్కడ కొనుగోలు చేసి ఎక్స్‌పోర్టు చేసేవారు. దీంతో ఇక్కడ ఎగుమతులు క్షీణించి మిర్చి ధర తగ్గిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఆరు నెలల పాటు ఇదే దందా కొనసాగింది. ఎప్పుడైతే సీఎం చంద్రబాబు వద్ద మిర్చియార్డు, మార్కెటింగ్ అధికారులు, వ్యాపారుల సమావేశం జరిగిందో అప్పుడు లారీ అసోసియేషన్ సమస్య పరిష్కారమైంది. దీంతో వ్యాపారులు స్వేచ్ఛగా ఎగుమతులు చేసుకున్నారు. ఇప్పుడు మళ్లీ అసోసియేషన్ పేరుతో మిర్చి ఎగుమతుదారులను కలిసి వినతిపత్రాలు ఇస్తున్నారు. తాము కిరాయిల విషయంలో తలదూర్చమని చెప్పి ఈ నెల 26న బిహార్‌లోని 72 ప్రాంతాలు, బెంగాల్‌లోని 28, అసోంలోని 22, దేశ సరిహద్దులోని ఆరు ప్రాంతాలకు లారీల కిరాయిలు నిర్ణయించారు. కారం ఎగుమతికి కూడా వేరేగా జాబితాని రూపొందించారు. దీనిపై ఎగుమతిదారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అసోసియేషన్‌తో సంబంధం లేకుండా లారీలు పెడితే ఎగుమతి చేస్తామని, లేదంటే ట్రేడ్ బంద్‌కు వెళతామని తెలిపారు.

శుభ్రత.. భద్రతపై దృష్టి పెట్టాలి

- పాతగుంటూరు పోలీసులకు ఎస్పీ ఆదేశాలు
- పోలీస్‌స్టేషన్‌లో వకుల్ జిందాల్ ఆకస్మికంగా తనిఖీ


పాతగుంటూరు పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 28: పోలీస్‌స్టేషన్లలో రికార్డుల నిర్వహణతో పాటు పరిసరాల శుభ్రత, భద్రతపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని ఎస్పీ వకుల్‌జిందాల్ పాతగుంటూరు పోలీసులను ఆదేశించారు. ఆదివారం ఆయన పాతగుంటూరు పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునేలా స్టేషన్లలో సౌకర్యవంతమైన వాతావరణం ఉండాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, రాత్రి గస్తీని పటిష్ఠ పరిచి, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండ్, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచి, అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్‌అజీజ్, సీఐలు అశహరి శ్రీనివాస్, వెంకటప్రసాద్, ఎస్ఐలు ప్రసాద్, రెహమాన్, వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


ఎన్టీఆర్ బస్టాండ్‌లో మహిళా ప్రయాణికుల రద్దీ

దసరాతో.. ఆర్టీసీ ఫుల్

- గత ఏడాదితో పోల్చితే పెరిగిన ఆక్యుపెన్సీ
- బస్సుల్లో ప్రయాణికుల రద్దీతో కండక్టర్ల అవస్థలు

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకంతో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతున్నాయి. ఇందుకు దసరా సెలవులు తోడవడంతో కాలు పెట్టేందుకు కూడా అవకాశం లేనంత రద్దీగా బస్సులు మారాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో దసరా పండుగ ప్రయాణాలతో ఆర్టీసీ సర్వీసులు మహిళలతో కిక్కిరిసిపోతున్నాయి. గత దసరాలో ఆక్యుపెన్సీ 70 నుంచి 80 శాతం వరకు మించలేదు. ఇప్పుడు ఆక్యుపెన్సీ రేషియో 100 దాటి 120 వరకు చేరుతున్నట్లు ఆర్టీసీ గణాంకాలు చెబుతున్నాయి. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళల రద్దీ అత్యధికంగా ఉంది. మరో వైపు రద్దీకి అనుగుణంగా అదనపు సిబ్బందిని కూడా నియమించాల్సిన అవసరం ఉందని ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు.

డిపోల్లో పెరుగుతోన్న సిక్ లీవ్‌లు..

బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరగడంతో కండక్టర్లు అల్లాడిపోతున్నారు. బస్సులో 100 మందికి పైగా ఉంటున్నారని, వారందరికి టిక్కెట్లు అందించడం కష్టసాధ్యంగా మారుతోందని వాపోతున్నారు. ఈ క్రమంలో అనారోగ్యాల బారిన పడి కొందరు కండక్టర్లు ఎక్కువగా సిక్‌లీవ్‌లు పెడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. గతంలో ఒక్కో డిపోలో రోజుకు 2 నుంచి 3 వరకు సిక్ లీవ్‌లు ఉంటే ప్రస్తుతం 6 మందికి పైనే సిక్ లీవ్‌లు పెడుతున్నట్లు సమాచారం.


ప్రకాశం బ్యారేజి దిగువకు ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

కృష్ణమ్మ.. మహోగ్రం

- బిక్కుబిక్కుమంటున్న లంకలు
- బ్యారేజి నుంచి 6.50 లక్షల క్యూసెక్కులు విడుదల
- ఇసుక బస్తాలతో కరకట్టను పటిష్ఠం చేస్తున్న అధికారులు
- తీరగ్రామాల్లో కలెక్టర్ పర్యటన.. బోటులో వెళ్లి ఉధృతి పరిశీలన
- పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని మంత్రి మనోహర్ ఆదేశాలు
- సాగర్ 26 గేట్ల నుంచి నీటి విడుదల.. పులిచింతల వద్ద రెడ్ అలర్ట్

తుళ్లూరు, తాడేపల్లి టౌన్, దుగ్గిరాల, కొల్లిపర, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి భారీగా నీటి విడుదలతో పాటు తెలంగాణలోని మూసీ నదీ ప్రవాహంతో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. ఆదివారం ఉదయం నుంచి నదిలో వరద క్రమేపీ పెరుగుతూ సాయంత్రానికి తీవ్రమైంది. శ్రీశైలం నుంచి 5,88,743 క్యూసెక్కుల వస్తుండగా వచ్చిన నీరు వచ్చినట్లుగా నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 26 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. అదేవిధంగా పులిచింతల నుంచి కూడా దిగువకు విడుదల చేస్తున్నారు. ఆరు లక్షల ఎనిమిది వేల క్యూసెక్కులు నీరు వస్తుండటంతో పులిచింతల ప్రాజెక్టు అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి కూడా 6.50 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. సోమవారం ఉదయం 8 గంటలకు 6.57 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం దాటొచ్చని ఇరిగేషన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో బ్యారేజీ నుంచి సముద్రం వరకు కృష్ణమ్మ ఉరకలెత్తుతూ ప్రవహిస్తోంది. దుగ్గిరాల పరిధిలోని కరకట్ట లోపలి వైపున పొలాల్లోకి వరద నీరు చేరుతోంది. వీర్లపాలెంలో వాణిజ్యపంటలు, పెదకొండూరులోని పసుపు, అరటి తోటలు మునిగిపోతున్నాయి. అర్ధరాత్రికి వరద మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందన్న హెచ్చరికలతో రైతుల ఆందోళన చెందుతున్నారు. గొడవర్రు వద్ద ఏటి ఒడ్డున ఉన్న తిరుపతమ్మతల్లి ఆలయాన్ని వరదనీరు చుట్టుముట్టింది.

పునరావాస కేంద్రాలకు వెళ్లండి : కలెక్టర్

తుళ్లూరు మండలం తాళ్లయ్యపాలెం లంక, ఉద్దండరాయ పాలెంలంక, తాడేపల్లి మండలం కృష్ణ ఒడ్డు మహానాడు కాలనీ, కరకట్ట ప్రాంతాల్లో కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఉద్దండరాయపాలెం లంక గ్రామాన్ని పడవలో వెళ్లి పరిశీలించారు. గ్రామంలో ద్విచక్ర వాహనంపై పర్యటించారు. నదిలో వరద పెరిగే అవకాశం ఉందని తక్షణం పునరావాస కేంద్రాలకు వెళ్లాలని గ్రామస్థులకు ఆమె సూచించారు. ఏ ఒక్కరు రిస్క్ తీసుకోవద్దని, ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని చెప్పారు. తాళ్ళయ్యపాలెంలో ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో వసతులను పరిశీలించారు. ఘాట్ల వద్ద భవానీ భక్తులు, ఇతరులు స్నానాలు ఆచరించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రమాదకరంగా ఉన్న కరకట్ట గట్లను గుర్తించి ముందస్తు జాగ్రత్తగా ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలన్నారు. వరదపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ (08632234014)కు సమాచారం అందించాలన్నారు. బ్యారేజి వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం బ్యారేజి ఎగువ, అమరావతి కరకట్ట దిగువ సీతానగరం మహానాడు, వారధి వద్ద నదీతీర ప్రాంతాల్లో నివసిస్తున్న వారి వద్దకు వెళ్లి మాట్లాడారు.


కొల్లిపర : బొమ్మువానిపాలెంలో కృష్ణానది వరద ఉధృతిని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

ప్రకాశం బ్యారేజి వద్ద రెండో ప్రమాద హెచ్చరిక

కృష్ణానదికి ఎగువ నుంచి భారీగా వరద పోటెత్తుతుండటంతో ప్రకాశం బ్యారేజ్ వద్ద రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ఇన్‌ఫ్లో 6,50,389 క్యూసెక్కులకు చేరుకుంది. బ్యారేజ్‌లో పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 3.07 టీఎంసీలు నిల్వ ఉండటంతో ఉదయమే రెండో ప్రమాద హెచ్చరికని జారీ చేశారు. బ్యారేజ్ గేట్లు అన్ని ఎత్తేసి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లోలో పెరుగుదల కనిపిస్తుండటంతో సోమవారం ఉదయం 8 గంటలకు 6.57 లక్షల క్యూసెక్కుల ప్రవాహం దాటొచ్చని ఇరిగేషన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

అధికారులు బాధ్యతగా ఉండాలి : మనోహర్

నదికి వరద ఉధృతి పెరుగుతుందని, ప్రతి ఒక్క అధికారి బాధ్యతగా ఉండాలని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొల్లిపర మండలం వల్లభాపురం, బొమ్మువానిపాలెం సమీపంలో వరద ఉధృతిని మంత్రి పరిశీలించారు. తూములూరు, హనుమాన్‌పాలెంలో పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. లంక గ్రామాల ప్రజలను కూడా అప్రమత్తం చేయాలని, అవసరమైతే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, బొమ్మువానిపాలెం రేవుల్లో పోలీసులతో పాటు వీఆర్వోలను ఏర్పాటు చేయాలన్నారు. మంత్రి వెంట ఇన్‌చార్జి తహసీల్దారు గోపాలకృష్ణ, సర్పంచ్ కొల్లి రజని, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్ పాల్గొన్నారు.


కృష్ణానది వరద ఉధృతిని పడవలో ప్రయాణిస్తూ పర్యవేక్షణ చేస్తున్న కలెక్టర్ అన్సరియా


సీతానగరం వద్ద పడవలను ఒడ్డుకు చేర్చుకుంటున్న మత్స్యకారులు

శిల్పారామాలకు జీవం పోసిన సీఎం చంద్రబాబు

● చైర్‌పర్సన్ మంజులారెడ్డి


సర్టిఫికెట్లను ప్రదానం చేసిన మంజులారెడ్డి

రెంటచింతల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన శిల్పారామాలకు జీవం పోసిన వ్యక్తి సీఎం నారా చంద్రబాబునాయుడని శిల్పారామం చైర్‌పర్సన్ చేరెడ్డి మంజులారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి రెంటాల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు గుంటూరు శిల్పారామంలో శాస్త్రీయ, జానపద నృత్య కళా ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా మంజులారెడ్డి మాట్లాడుతూ.. గత పాలనలో రూ.6 లక్షలు ఉన్న ఆదాయం నేడు రూ.2 కోట్లకు చేరుకోవడంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలే కారణమన్నారు. గుంటూరులో రూ.65 లక్షలతో బోటింగ్ ఏర్పాటు చేయడానికి టెండర్లను పూర్తి చేశామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. హైస్కూల్ హెచ్ఎం నాగభారతిని ఘనంగా సత్కరించి, చిన్నారులకు మెరిట్ సర్టిఫికెట్లను చైర్‌పర్సన్ ప్రదానం చేశారు.

నన్నపనేని పెరటిలో జంబో అరటి గెల


పెరటిలోని అరటితో నన్నపనేని

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళ కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి పెరటిలో జంబో అరటి గెల కాసింది. నాందేడు రకం అరటిని పెంచుతున్నామని దీనికి 16కు పైగా హస్తాలు ఏర్పడి 240 కాయలు కాశాయని ఆమె తెలిపారు. పెరటిలో వివిధ రకాల మొక్కలు పెంచుతూ వాటి సంరక్షణలో ప్రతిరోజు నన్నపనేని నిమగ్నమవుతున్నారు.

దసరాకు ఆరు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా దూర ప్రాంతాలకు ఆరు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07066 తిరుపతి - గువహటి రైలు ఆదివారం రాత్రి బయలుదేరింది. ఈ రైలు సోమవారం మధ్యాహ్నం 3.20కి గుంటూరు చేరుకుంటుంది. 07071 సికింద్రాబాద్ - అగర్తల అక్టోబరు 1న బుధవారం బయలుదేరుతుంది. 07073 గుంటూరు - రంగాపార నార్త్ వచ్చే బుధవారం బయలుదేరుతుంది. 07074 గుంటూరు - న్యూ జలపాయిగురి స్పెషల్ అక్టోబరు 2న గురువారం బయలు దేరుతుంది. అన్ని రైళ్లలో జనరల్, స్లీపర్, సెకండ్ ఏసీ బోగీలుంటాయి.

జగనన్న కాలనీ పేరుతో పేదలను ముంచిన 'బొల్లా'

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు


మాట్లాడుతున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) కార్యకర్తలను కాపాడుకోవడానికే డిజిటల్ బుక్ ప్రారంభించామంటున్న వైసీపీ.. నారా లోకేశ్ రెడ్ బుక్‌ను చూసి దానిని తేవడం పులిని చూసి నక్క వాత పెట్టుకున్న సామెతగా ఉందని.. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఎద్దేవ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేసిన అసత్య ఆరోపణలను ఖండించారు. జాలపాలెం అంశంలో వైసీపీ ప్రభుత్వంలోనే కోర్టుకు వెళ్లారని.. నేడు కూటమి ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వినుకొండ పరిస్థితుల దృష్ట్యా ఎన్ఎస్‌పీ స్థలం ఇస్తే ఏమి చేశారని నిలదీశారు. కొండపై దేవాలయం, ఘాట్ రోడ్డు నిర్మించలేక పోయారని మండిపడ్డారు. ఇనిమెళ్లలో శ్మశాన భూమి ఆక్రమించారన్న ఆరోపణలను కొట్టిపడేశారు. గతంలో పదవిని అడ్డు పెట్టుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసింది బొల్లా కాదా అని నిలదీశారు. మాజీ ముఖ్యమంత్రుల నుంచి తమ కంపెనీ ఎన్నో అవార్డులు పొందిందని పేర్కొన్నారు. నాణ్యత ఉండబట్టే తమ కంపెని రైతుల మన్ననలు పొందుతోందన్నారు. బొల్లా చౌకబారు చద్ది విమర్శలు ప్రజలు నమ్మరని జీవీ స్పష్టం చేశారు. జగనన్న కాలనీ పేరుతో పేదలను మోసం చేసిన చరిత్ర నీదంటూ.. బొల్లాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జున, నాగశ్రీను, బీసీ నాయకులు గోవిందరాజు పాల్గొన్నారు.

ఆలోచింపజేస్తున్న నాటక ప్రదర్శనలు


కస్తూరి తిలకం నాటకంలోని సన్నివేశం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ప్రదర్శిస్తున్న నాటిక, నాటకాలు ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్నాయి. కళల కాణాచి, ఆర్ఎస్ఆర్ గ్రీన్ వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటకోత్సవాల్లో ఆదివారం రెండు పద్య నాటకాలు, సాంఘిక నాటకం, నాటికను ప్రదర్శించారు. బిల్వమంగళుడు, చింతామణి మధ్య సన్నివేశాలను కళాకారులు కస్తూరి తిలకంలో ప్రదర్శించారు. ఈ నాటకాన్ని శారద ప్రసన్న రచించగా, సుబ్బరాజు దర్శకత్వం వహించారు. మదిర చందాల కేశవరాజు కళాపరిషత్ కళాకారులు అద్భుత ప్రదర్శన ఇచ్చారు. మిర్యాలగూడ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు ప్రదర్శించిన బ్రహ్మరథం నాటకాన్ని శివ సుబ్రహ్మణ్యం రచించగా రామచంద్రరావు దర్శకత్వం వహించారు. హైదరాబాద్ కళాంజలి కళాకారులు ప్రదర్శించిన సాంఘిక నాటకం యాగం శ్రీశైలంమూర్తి రచించగా రాధాకృష్ణమూర్తి దర్శకత్వం వహించారు. విజయవాడ హర్ష క్రియేషన్స్ కళాకారులు భువి కోరని భ్రమణం సాంఘిక నాటకం ప్రదర్శించారు. పి.వెంకటేశ్వరరావు నాటకీకరణ చేయగా, కత్తి శ్యాంప్రసాద్ దర్శకత్వం వహించారు. సోమవారం నాలుగు నాటికలు ప్రదర్శించనున్నారు. కళల కాణాచి అధ్యక్షుడు, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్, చెరుకుమల్లి సింగారావు, దేవరపల్లి భవానీ, హకీంజాని, అయినాల మల్లేశ్వరరావు, కనపర్తి మధుకర్ తదితరులు పర్యవేక్షించారు.

చదరంగంలో ప్రతి క్షణం విలువైనదే!

ఇండియన్ చెస్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి



మాట్లాడుతున్న కోనేరు హంపి

గుంటూరు (విద్య) సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): చదరంగంలో ప్రతి క్షణం విలువైనదేనని ఇండియన్ చెస్ గ్రాండ్ మాస్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోనేరు హంపి అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం కోనేరు హంపి మాట్లాడుతూ చెస్ క్రీడాకారులందరికీ ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ ఒక గొప్ప వేదికని పేర్కొన్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులతో ఆడే అవకాశం.. అనుభవాన్ని పెంపొందించుకునేందుకు దోహదం చేస్తుందన్నారు. ఆటలో కొన్నిసార్లు ఆటంకాలు, వైఫల్యాలు ఎదురైనా వాటిని అధిగమించే ధైర్యం చాలా ముఖ్యమన్నారు. పాజిటివ్‌గా ఆలోచిస్తూ, ఎప్పటికీ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలన్నారు. నెరవేర్చాం అనుకోవడం కంటే ఇంకా నేర్చుకోవాలి అనే తపన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ ఏకే వర్మ, విజ్ఞాన్ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చాంబర్ ఆఫ్ కామర్స్.. కార్యవర్గ ఎన్నికలు

గుంటూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యాపారవర్గాలకు ప్రతిష్టాత్మకమైన ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గం ఎన్నికలకు రంగం సిద్ధమైంది. జిన్నా టవర్ సెంటర్‌లోని చాంబర్ భవనంలో నిర్వహణ ఏర్పాట్లు చేశారు. చాంబర్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు నేతృత్వంలో సోమవారం ఉదయం సర్వసభ్య సమావేశం నిర్వహించిన అనంతరం ఎన్నికలు ప్రారంభం కానున్నట్లు ఆతుకూరి తెలిపారు. యేల్చూరి ప్యానల్‌ను గెలిపించుకునేందుకు.. ఆతుకూరి ఆంజనేయులు పట్టుదలతో ఉన్నారు. ఆయన స్వయంగా తెనాలి, బాపట్ల, పల్నాడు ప్రాంతాల్లో పర్యటిస్తూ విస్తృత ప్రచారం చేశారు. బాలకృష్ణ ప్యానల్ సభ్యులు కూడా ప్రచారం చేసుకుంటున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరగనున్నాయి. అనంతరం బ్యాలెట్ బాక్స్‌లో పోలైన ఓట్లను అప్పటికప్పుడు లెక్కించి ఫలితాలను ప్రకటించనున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగనుంది. గతేడాది జరిగిన ఎన్నికల ఫలితాలను అర్ధరాత్రి దాటిన తర్వాత మూడు గంటలకు ప్రకటించారు.

బీసీ బిడ్డను ఆదుకోవడం తప్పా?

● వైసీపీ తీరుపై కనపర్తి ఆగ్రహం



గుంటూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల హత్యాకాండలో బలైన బీసీ నేత బిడ్డను ఆదుకోవడం తప్పెలా అవుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పల్నాడు ప్రజల కోరికపై నరహంతకుడు, అరాచకవాదైన పిన్నెల్లి సుందరరామిరెడ్డిని మావోయిస్టులు హతమార్స్తే ఆయన కుమారుడికి ఏసీటీవో ఉద్యోగం ఇచ్చిన ఆనాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చేసింది ఒప్పయితే, నేడు వైసీపీ గూండాలు పట్టపగలు అతికిరాతకంగా ఓ బీసీ నాయకుడి గొంతు కోస్తే.. అతడి కుమారుడికి ఉద్యోగం ఇవ్వడం తప్పెలా అవుతుందని వైసీపీ నేతలను ప్రశ్నించారు. పల్నాడు జిల్లాలో హత్యకు గురైన తోట చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం కల్పించే బిల్లును మండలిలో వైసీపీ సభ్యులు అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. 'బడుగు, బలహీన వర్గాల వారిని వేధించి చంపిన కుటుంబానికి మాత్రం అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ ఉద్యోగం ఇవ్వొచ్చుకానీ, హత్య చేయబడ్డ బీసీ బిడ్డకు మాత్రం జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం కూడా ఇవ్వకూడదా?' అని ప్రశ్నించారు. వైసీపీ ఎమ్మెల్సీ ఏసురత్నం ఇది మంచి ప్రతిపాదన అని చెపుతున్నా వినకుండా, ఆయన్ను కూడా బొత్స సత్యనారాయణ 'ఏయ్' అంటూ సభలో బెదిరించడమేమిటని మండిపడ్డారు.

రాజధానిలో.. ఠీవీగా ఎన్టీఆర్

(5వ పేజీ తరువాయి)

నిర్మించిన స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాజెక్టు కు సంబంధించిన అంశాలను ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ కమిషనరు కన్నబాబు, ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారధితోపాటు అధికారుల బృందం ఓమారు ఏక్తానగర్‌ను సందర్శించి వచ్చింది.

ప్రాజెక్టులో ప్రధానాంశాలివే

ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్న బేస్‌లో ఎన్టీఆర్ మెమోరియల్ హాలు, మ్యూజియం, ఎన్టీఆర్ జీవిత చరిత్రను తెలియజేసే కళాకృతులు, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్‌లను నిర్మించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకోసం బేస్ పీఠభవనాన్ని జీ+3గా నిర్మించనున్నారు. కొండ శిఖరంపై క్యాంటీన్, ప్రత్యేకాకర్షణగా ఫ్యూనిక్యులర్ రైల్వే, కొండపైన పార్కింగ్ ఏరియా, టిక్కెట్ కౌంటర్, కొండపైకి ఘాట్‌రోడ్డు, సర్వీసు భవనాలు, ఉద్యానవనాలు, ఫ్యాబ్రిక్ కప్ నిర్మాణాలతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనున్నది. కొండ దిగువన 450 ఎకరాల సరస్సును యాత్రికులను ఆకట్టుకునేలా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందులో జెట్టీ బోటింగ్ ఉంటుంది. చుట్టూ వాటర్ ఫ్రంట్‌గా ఉండే కొండ దిగువన స్టార్ హోటల్, షాపింగ్ సెంటర్లు, రిసార్టులను ఏర్పాటుచేయనున్నారు. ఎన్టీఆర్ విగ్రహం లోపల లిఫ్టులు ఏర్పాటు చేస్తారు. ఈ ప్రాజెక్టు ఇంచుమించు 170 ఎకరాల్లో ఆవిష్కృతం కానుంది. ఎన్టీఆర్ విగ్రహంతో పాటుగా అల్లూరి సీతారామరాజు, పొట్టి శ్రీరాములు విగ్రహాలను కూడా ఏర్పాటుచేసే అంశాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది.

అమరేశ్వరుని సన్నిధిలో పల్లా


పల్లా దంపతులకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ రేఖ

అమరావతి, సెప్టెంబరు 28: అమరావతిలోని అమరేశ్వరస్వామి ఆలయాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయఅధికారులు, అర్చకులు శ్రీనివాసరావు దంపతులకు స్వాగతం పలికి ఆయన పేరు మీద స్వామివార్లకు పూజలు నిర్వహించారు. వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈఓ రేఖ ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00


వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



ప్రమాద స్థలాల్లో ఆనందబాబు, ఆదినారాయణ మృతదేహాలు


దుర్గి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందిన ఘటన దుర్గి మండల పరిధిలో చోటుచేసుకుంది. కంచరగుంటకు చెందిన రాయపాటి ఆనందబాబు (14) బైకుపై దుర్గి వచ్చి తిరిగి వెళ్తుండగా.. హాలియాకు వెళ్తున్న ట్రాక్టర్‌తో ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఆనందబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ప్రమాదంలో.. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం సిరిపురానికి చెందిన కొమరగిరి ఆదినారాయణ (36) మండలంలోని ఆత్మకూరు వద్ద గల ఓ నర్సరీలో పనిచేస్తున్నాడు. కూరగాయల కోసం బైకుపై కొడుకు శ్రీనివాసరావుతో కలిసి దుర్గి వస్తుండగా మార్కెట్‌యార్డు సమీపంలో గుర్తు తెలియని వాహనం వరిని ఢీకొంది. ఆదినారాయణ అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలు కావడంతో మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆనందబాబు, ఆదినారాయణ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దుర్గి ఎస్ఐ సుధీర్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

క్రాస్ చేస్తూ ఆటోకి లారీ తగిలి..


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

ఫిరంగిపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేరికపూడి గ్రామానికి చెందిన రమావత్ కృష్ణనాయక్ (69) ఆటలో ప్రయాణిస్తుండగా.. లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడని పోలీసులు ఆదివారం తెలిపారు. కృష్ణనాయక్, మరో నలుగురు ఆటోలో మండలంలోని అమీనాబాద్ గ్రామంలో జరుగుతున్న అమ్మవారి నవరాత్రులకు వెళ్లి హరికథ చెప్పి తిరిగి వస్తున్నారు. ఫిరంగిపురం సమీపంలో శనివారం రాత్రి లారీని క్రాస్ చేస్తుండగా లారీ అతి వేగంగా, నిర్లక్ష్యంగా వస్తూ ఆటోకు తగిలింది. దీంతో ఆటో బోల్తా పడి కృష్ణ నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురికి గాయాలయ్యాయి. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

చికిత్స పొందుతూ.. కౌలురైతు మృతి


అప్పారావు (ఫైల్ ఫోటో)

వట్టి చెరుకూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రుణ భారం అధికమై.. పంట చేతికొచ్చే మార్గం లేక మనస్తాపంతో పురుగు మందు తాగిన కౌలు రైతు చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని కొర్నెపాడు గ్రామానికి చెందిన మన్నవ వెంకట అప్పారావు(42) మూడేళ్లుగా సొంత పొలం రెండు ఎకరాలతో పాటు 25 ఎకరాల వరకు కౌలుకు పొలం తీసుకుని పత్తి, మిర్చి పంటలు సాగు చేస్తున్నాడు. రెండేళ్లుగా సరైన దిగుబడి, ధరలు లభించక అప్పుల భారం పెరిగి పోయింది. ఈ ఏడాది 20 ఎకరాల వరకు పత్తి పంట సాగు చేశాడు. ఇటీవల వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీటితో పత్తి మొక్కల ఎదుగుదల లేకుండా పోయింది. అప్పులు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఉండటం... పత్తి పైరు చేతికి అందే పరిస్థితి లేదనే మనస్తాపంతో.. ఈ నెల 23న వెంకట అప్పారావు పురుగు మందు తాగాడు. అతను అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులు, స్నేహితులు గుంటూరులోని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృత దేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య కాంచన, ఇద్దరు కుమారులు ఉన్నారు.

16 ఏళ్లకు టెయిల్‌పాండ్‌కు భారీ వరద

రెంటచింతల,సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు ఆదివారం భారీగా వరద నీరు వస్తుండడంతో 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 16 గేట్లను 7 మీటర్లు, 2 గేట్లను 4.5 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 5,88,988 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. సాగర్ నుంచి 5,79,015 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 72.79 మీటర్ల మేర నీరుండగా ఇది 5.375 టీఎంసీలకు సమానం. విద్యుదుత్పత్తిని నిలిపి వేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఉన్న సమయంలో 2009 సెప్టెంబరు 2 తర్వాత ఇంత భారీ స్థాయిలో నీరు రావడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 37.99 టీఎంసీల నీటి నిల్వ ఉన్నాయి. ఎగువ నుంచి 6,52,520 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ఐదు గేట్లను నాలుగు అడుగులు, 13 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 6,08,816, లీకుల ద్వారా 400, మొత్తం 6,09,216 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్

పార్టీ నేతలు నిత్యం ప్రజల్లో ఉండాలి

● టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రజల కోసం పుట్టిన పార్టీ అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక 54వ డివిజన్ శివనాగరాజు కాలనీలో వార్డు ప్రెసిడెంట్ యర్రగుంట్ల ఆనంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పార్టీ నేతలు అనునిత్యం ప్రజల్లో ఉండాలన్నారు. పార్టీ కార్యాలయం ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండాలని సూచించారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం నియోజకవర్గాన్ని గాలికి వదిలేసిందని, అభివృద్ధి సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముప్పవరపు భారతి, గోళ్ల ప్రభాకర్, మహంకాళి నరసింహారావు పాల్గొన్నారు.

ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్ సేవలు ప్రశంసనీయం

గుంటూరు (విద్య) సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న గుమస్తాల కుటుంబాల విద్యార్థుల కోసం స్కాలర్‌షిప్లు, నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, ఇతర విద్యా ఉపకరణాలు అందిస్తూ వారి విద్యాభివృద్ధికి దోహదపడుతున్న ఫ్యాన్సీ, స్టేషనరీ, జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని తూర్పు ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కొత్తపేట గుంటూరు పట్టణ ఫ్యాన్సీ స్టేషనరీ జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో వెయ్యి మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, 4000 నోటు పుస్తకాలు, పెన్నులు, స్కూల్ బ్యాగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు జుజ్జూరు శేష ప్రభాకరరావు, ఉపాధ్యక్షులు గర్రె శ్రీరాములు, బచ్చు వెంకటసుబ్బయ్య గల్లా రమేశ్ కుమార్, ప్రధానకార్యదర్శి రంగా వెంకట రామకృష్ణ కార్యదర్శులు వేమూరి వెంకట కామేశ్వరరావు, బచ్చు లక్ష్మీనరశ్రీనివాసరావు, పాదర్తి వెంకటేశ్వర్లు, కోశాధికారి అచ్యుత నిరంజన్, కార్యక్రమ నిర్వాహకులు చుండూరు దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.



సావిత్రి విగ్రహానికి నివాళులర్పిస్తున్న జయసుధ, పాతూరి రంగారావు తదితరులు

తెలుగు తెరకు చెరగని జ్ఞాపకం సావిత్రి

● సినీ నటి జయసుధ

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు తెరపై అనేక పాత్రలకు ప్రాణం పోసి ప్రేక్షకుడి మదిలో చిరస్థాయిగా మహానటి సావిత్రి నిలిచిపోయారని సినీ నటి జయసుధ అన్నారు. స్థానిక నాజ్‌సెంటర్‌లో ఉన్న సావిత్రి విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జయసుధ మాట్లాడుతూ, సావిత్రి అభినయం, అందం గురించి ఎంత గొప్పగా వర్ణించినా తక్కువేనని అన్నారు. సావిత్రి నటన స్థానాన్ని వేరెవరూ భర్తీ చేయలేరని కొనియాడారు. ఈ సందర్భంగా సావిత్రి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. కళాదర్బార్ అధ్యక్షుడు డాక్టర్ పొత్తూరి రంగారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు బి. చంద్రబాబు, భాను ప్రకాష్, వెంకటరత్నం, శివకుమార్, హనుమాన్‌సింగ్, కృష్ణారావు, ధర్మసింగ్, సత్యవాణి, రజని తదితరులు పాల్గొన్నారు.

'జ్యోతి'కి మేయర్ నాని రూ.65 వేల సాయం

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు గ్రామానికి చెందిన అంధ మహిళ పాములపాటి జ్యోతికి మేయర్ నాని మిత్ర మండలి ఆధ్వర్యంలో గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని) రూ. 65 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో జ్యోతి దీనగాథ ప్రచురితమైంది. అనంతరం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో మేయర్ నాని జ్యోతికి ఆర్థిక సహాయం అందజేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం అశోక్ నగర్ ఒకటో లైన్‌లోని క్యాంప్ కార్యాలయంలో మేయర్ నాని మిత్రమండలి నేత కడప సాయి, అయన స్నేహితులు.. జ్యోతికి రూ. 65 వేల నగదు, చీరలు మేయర్ రవీంద్ర చేతుల మీదుగా అందించారు. జ్యోతి కుమారుడు రక్షణ కుమార్‌కు చదువు నిమిత్తం ప్రతి ఏడాది స్కూల్ ఫీజును తాము కడతామని కడప సాయి ఈ సంద్భంగా హామీ ఇచ్చారు. మేయర్ రవీంద్ర మాట్లాడుతూ, అంధత్వంతో బాధపడుతున్న జ్యోతికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ స్పందనతో గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం లభించిందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కసుకుర్తి హనుమంతరావు, అనిల్, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మేయర్ నాని, మిత్ర మండలి సభ్యులు

భగత్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించాలి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ సామ్రాజ్య వాదుల దోపిడి పీడనల నుంచి విముక్తి కోసం పోరాటం చేసిన భగత్ సింగ్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ 118వ జయంతి సందర్భంగా స్థానిక కొత్తపేటలో ఆయన విగ్రహానికి విద్యార్థి సంఘాలు ఘనంగా నివాళులర్పించాయి. అనంతరం విద్యార్థి నేతలు మాట్లాడుతూ, సామ్రాజ్యవాద వ్యతిరేఖ పోరాటానికి భగత్‌సింగ్ ప్రతీకగా నిలిచారని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్‌సింగ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో బందెలనాసర్ జీ, వలీ, యశ్వంత్, ప్రణీత్, సందీప్, రెహమన్, సాగర్, శశి, మస్తాన్ పాల్గొన్నారు.



భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

గుండె జబ్బులపై అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పెరుగుతోన్న గుండెజబ్బులపై ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ వివేక్ వీరంరెడ్డి సూచించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్యసభలో ఆయన ప్రసంగించారు. షుగర్, రక్తపోటు, కొలెస్ట్రాల్, ఊబకాయం అదుపులో ఉంచుకొంటే గుండెజబ్బులు రాకుండా నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, టీవీ సాయిరామ్, ప్రొఫెసర్ రత్నారావు, కె చంద్రశేఖరరావు, నరేష్ తదితరులున్నారు.

కార్మికుల సంక్షేమానికే ప్రాధాన్యం

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర



మెడికల్ క్యాంపులో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న నగర మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్మికుల ఆరోగ్యమే నగర ప్రజల ఆరోగ్యానికి రక్ష అని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. ఆదివారం గుంటూరు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సౌజన్యంతో గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య ఇంజినీరింగ్ కార్మికులు వారి కుటుంబసభ్యులకు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు నేతృత్వంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. సఫాయి మిత్రా సురక్షా షివిర్‌లో భాగంగా నిర్వహించిన ఈ మెడికల్ క్యాంపు లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య స్కూల్ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా కార్మికులకు గైనిక్, కార్డియాలజీ, ఈసీజీ ఎకో, యూరాలజీ, డెర్మటాలజీ, న్యూరాలజీ, తదితర ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచే ప్రజారోగ్య కార్మికులు నిత్యం డ్రైన్ల వెంట ప్రమాదకర వ్యర్థాలు శుభ్రం చేస్తూ తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల భద్రత, సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తోందని మేయర్ పేర్కొన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ, ఐఎంఏ సహకారంతో ప్రజారోగ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు అత్యాధునిక కార్పొరేట్ స్థాయి వైద్య పరీక్షలు అందించి, అవసరమైన మందులు ఉచితంగా అందించామని చెప్పారు. వైద్య పరీక్షల అనంతరం వారిని ఇంటికి తీసుకెళ్లడానికి ప్రత్యేకంగా బస్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు మాట్లాడుతూ, ప్రజారోగ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు జీఎంసీ మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసి ఉచిత వైద్య పరీక్షలు, మందులు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఐఎంఏ గుంటూరు ప్రెసిడెంట్ డాక్టర్ వై.సుబ్బారాయుడు మాట్లాడుతూ, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచి, ప్రజల ఆరోగ్యం కోసం కష్టపడే కార్మికుల ఆరోగ్యం మెరుగుపరచడానికి ఐఎంఏ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. అనంతరం హెల్త్ క్యాంప్‌లో పాల్గొన్న వైద్యులకు నగరపాలక సంస్థ నుంచి మేయర్, కమిషనర్ షీల్డ్‌లు బహూకరించారు. కార్యక్రమంలో ఐఎంఏ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అమర లింగేశ్వరరావు, సెక్రెటరి డాక్టర్ సాయి కృష్ణ, జాయింట్ సెక్రెటరి డాక్టర్ చంద్ర రాధికారాణి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు డాక్టర్ మోహన్ భాస్కర్, డాక్టర్ ఈ.కృష్ణమూర్తి, డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, డాక్టర్ జి.శివరామకృష్ణ, డాక్టర్ బి.అప్పారావు, జీఎంసీ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు బి.సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఎస్ఈ (ఇంచార్జి) సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ (ఇంచార్జి) రామారావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సాహితీ రంగానికి పప్పుల దేవదాసు విశిష్ట సేవలు

● ఎస్‌సీహెచ్‌సీబీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ నాయకులు

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సాహితీ రంగానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, హైకోర్టు అడ్వకేటు పప్పుల దేవదాసు విశిష్ట సేవలందిస్తున్నారని బార్ అసోసియేషన్ నాయకులు ప్రశంసించారు. ఏపీ హైకోర్టులోని ఎస్‌సీహెచ్‌సీబీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బార్ అసోసియేషన్ హాల్‌లో దేవదాసుకు గుర్రం జాషువా పురస్కారాన్ని ప్రదానం చేశారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ దేవదాసు టీడీపీ సాంస్కృతిక విభాగం నాయకుడిగా ఉంటూ ఎంతోమంది సాహితీవేత్తలను ప్రోత్సహించారని చెప్పారు. కార్యక్రమంలో జంపని పాల్ ప్రసాదు, దుర్గాప్రసాదు, ఎన్ శామ్యూల్, రాజేంద్రప్రసాదు పాల్గొన్నారు.

ఆంజనేయులు మృతి వడ్డెర జాతికి తీరని లోటు

● వడ్డెర సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్‌రావు



ఆంజనేయులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లె ఈశ్వర్, క్రాంతికుమార్ తదితరులు

గుంటూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వడ్డెర సంక్షేమ సంఘం నేత దివంగత తన్నీరు ఆంజనేయులు మృతి వడ్డెర జాతికి తీరని లోటని వడ్డెర సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ మల్లె ఈశ్వర్‌రావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు వల్లెపు ముసలయ్య ఆధ్వర్యంలో ఆంజనేయులు సంస్మరణ సభ జీటీ రోడ్డులోని దర్గా సెంటర్‌లో ఓ హోటల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ముసలయ్య మాట్లాడుతూ వడ్డెర జాతి సంక్షేమానికి, అభివృద్ధికి ఆంజనేయులు నిత్యం తపించారన్నారు. అనంతరం ఆంజనేయులు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్, మిరియాల సాంబయ్య, తన్నీరు శ్రీనివాసరావు, తురకా శ్రీనుబాబు, తురకా నారాయణ, కుంచెపు బుజ్జి తదితరులున్నారు.



గుంటూరు రైల్వేస్టేషన్‌లో రద్దీ నియంత్రణని పరిశీలిస్తున్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

రైల్వేస్టేషన్‌ని పరిశీలించిన డీఆర్ఎం

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దసర పండగ సందర్భంగా గుంటూరు రైల్వేస్టేషన్‌కు వచ్చి, వెళ్లే ప్రయాణీకుల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న దృష్ట్యా రైల్వే శాఖ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టింది. ఆదివారం డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్ రైల్వేస్టేషన్ ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకొన్నారు. తూర్పు వైపున రద్దీ ఎక్కువగా ఉంటున్న దృష్ట్యా టూ వీలర్స్, నాలుగు చక్రాల వాహనాలను కొద్ది దూరంలోనే నిలిపేయాలన్నారు. అరండల్‌పేట వైపున ఎక్కువగా వాహనదారులు వినియోగించుకొనేలా చూడాలన్నారు.



ఉద్యోగోన్నతి పొందిన ఏఎస్సైలను అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

ఆరుగురు హెడ్ కానిస్టేబుళ్ళకు ఉద్యోగోన్నతి

గుంటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆరుగురు హెడ్ కానిస్టేబుళ్ళకు ఏఎస్సైలుగా ఉద్యోగోన్నతి లభించింది. ఉద్యోగోన్నతి పొందిన ఆయా హెడ్ కానిస్టేబుళ్ళు ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాద పూర్వకంగా కలసి జ్ఞాపికను అందించి ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగోన్నతి పొందిన ఆరుగురికి అభినందనలు తెలిపి, వారి సుదీర్ఘ అనుభవాన్ని, తెలివి తేటలను ఉపయోగించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ఎస్పీ సూచించారు. ఉద్యోగోన్నతి పొందిన వారిలో ఎం.వర కుమార్, సీహెచ్ పుల్లారావు, ఎ.సాంబశివరావు, ఆర్.రవి, ఎం.సత్యనారాయణ, షేక్ షంషుద్దీన్ తదితరులు ఉన్నారు.

ఉరి వేసుకొని టీ మాస్టర్ ఆత్మహత్య

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్వీఎన్ కాలనీలో గల వైష్ణవి నగర్‌కు చెందిన మదమంచి నరేంద్ర (35) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ గంగా వెంకటేశ్వర్లు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి పరిధిలోని కట్టావారిపాలేనికి చెందిన నరేంద్ర కొద్ది సంవత్సరాలుగా గుంటూరులో ఉంటున్నాడు. సుమారు 12 ఏళ్ల క్రితం నరేంద్ర రాజమండ్రి ప్రాంతానికి చెందిన ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. వారికి ఇరువురు పిల్లలు పుట్టిన తర్వాత సుమారు ఆరేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీనితో భార్య పిల్లలతో పుట్టింటికి వెళ్ళిపోయింది. నరేంద్రపై గృహహింస కేసుతోపాటు భరణం కేసులు బనాయించింది. నరేంద్ర టీ మాస్టర్‌గా పని చేస్తుంటాడు. భార్య పుట్టింటికి వెళ్లిపోవడం, మరోవైపు కేసుల నేపద్యంలో నరేంద్ర మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి మదమంచి శివరామారావు ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హిందూ మనోభావాలతో ఆటలాడుతున్న షర్మిల

● బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి జయప్రకాష్ నారాయణ



మాట్లాడుతున్న వల్లూరి జయప్రకాష్ నారాయణ

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హిందూ మనోభా వాలతో ఏపీసీసీ చీఫ్ షర్మిల ఆటలాడుతున్నరని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధి కార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ మండిపడ్డారు. గుంటూరు లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీటీడీ నిధుల తో దళితవాడల్లో దేవాలయాలు ఎవరు కట్టమన్నారంటూ ఆమె చేసిన వ్యాఖ్యలకు అసలు అర్థముందా అని ప్రశ్నించారు. హిందువులు కానుకలు అందజేస్తే వాటితో దేవాలయాల కడితే అది నేరమా అని నిలదీశారు. హిందువులపై ఇష్టానుసారంగా ప్రవర్తించబట్టే కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిరస్కరించారని ఎద్దేవా చేశారు. మసీదులు, చర్చీలపై మాట్లాడని షర్మిల దేవాలయాలపై మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. క్రిస్టియన్ మతం ఆచరించే ఆమె హిందూ మతం గురించి, ఆర్ఎస్ఎస్‌పై విమర్శలు చేయడం దారుణమన్నారు. ఈ వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

కరుణించు.. కనకదుర్గమ్మా!

● ఘనంగా దేవీ నవరాత్రులు
● కనువిందు చేస్తున్న అమ్మవారి అలంకరణలు



బృందావన్‌గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గాయత్రి దేవి అలంకరణ



అరండల్‌పేట అష్టలక్ష్మీ ఆలయంలో పుష్పశయ్య అలంకరణలో అమ్మవారు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): భక్తులను కరుణించే జగన్మాత శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. ఆదివారం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. గో పూజ, సువాసిని, కుమారి పూజలు సువాసినులచే సామూహిక కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు దేవాలయాల్లో అమ్మవారిని శ్రీ దుర్గాదేవి, గౌరిదేవి, కాళికాదేవి, గాయత్రి దేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, పలు దేవాలయాల్లో అన్నదాన వితరణ జరిగాయి.



ఏటీ అగ్రహారం, దత్త సాయి మందిరంలో రూ.50 లక్షలలో ధనలక్ష్మి అలంకారం

● గుంటూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నగరంలో వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీ రాజరాజేశ్వరిదేవిగా, సంగడిగుంట రెడ్లబజారులో ఉన్న శ్రీకనకదుర్గమ్మ



శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకరణలో అమ్మవారు



లాలాపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గజలక్ష్మీ దేవిగా పద్మావతి అమ్మవారు

ఆలయంలో శ్రీమహాచండీదేవిగా, చుట్టుగుంట పోలేరమ్మ తల్లి ఆలయంలో శ్రీ మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలానే ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఎన్‌క్లేవ్‌లో టీఎల్‌వీ వీరాంజనేయులు ఆధ్వర్యంలో అమ్మవారు శ్రీ మహాచండీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళా ముత్తయిదువలతో కుంకుమపూజలు నిర్వహించారు.

● గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా లాలాపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పద్మావతి అమ్మవారు ఆదివారం గజలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే కొత్తపేటలోని శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానంలో రుక్మిణి అమ్మవారు ఆదివారం ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలలో ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపిస్తున్నారు.



అమ్మవారి పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి, రామచంద్రరావు దంపతులు

చెడుపై మంచి సాధించిన గెలుపే విజయదశమి

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి వేడుకలు నిర్వహించుకుంటామని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి వేడుకల్లో ఆదివారం ఎమ్మెల్యే మాధవి, రామచంద్రరావు దంపతులు పాల్గొన్నారు. ఆర్ అగ్రహారంలోని శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానం, ఏటి అగ్రహారం కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, పట్నంబజార్‌లోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, 32వ డివిజన్ బ్రాడీపేట 4/15వ లైన్‌లోని కామాక్షి మార్గ్ అపార్ట్మెంట్‌లో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ, సన్మార్గాన్ని, ధర్మాన్ని సూచించే పండుగ దసరా అని అన్నారు. దసరా ఉత్సవాలు అందరికీ ఆధ్యాత్మిక శక్తిని, నూతన ఉత్సాహాన్ని అందిస్తాయని మాధవి పేర్కొన్నారు.

తెలుగు సాహితీలోక దిగ్గజం గుర్రం జాషువా



జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహితీలోకంలో దిగ్గజ కవికోకిల గుర్రం జాషువా అని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ కొనియాడారు. జాషువా 130వ జయంతి సందర్భంగా గుంటూరు నగరంపాలెంలోని జాషువా విగ్రహానికి ఆదివారం ఆయన పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తన జీవిత పర్యాంతం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు జాషువా అని మోహనకృష్ణ అన్నారు. తన కవితల ద్వారా సమాజంలో అసమానతలను రూపుమాపడానికి అహర్నిశలు ఆయన శ్రమించారన్నారు. గుర్రం జాషువా జీవితం నేటి యువతకు మార్గదర్శకమని మోహనకృష్ణ పేర్కొన్నారు.

నగరంపాలెంలో...

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాకవి గుర్రం జాషువా జయంతి నగరంలో ఘనంగా నిర్వహించారు. జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో నగరంపాలెంలోని జాషువా విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, బీజేపి జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్ర ట్రస్టీ పాశం రామారావుతో పాటు పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సామాజిక ప్రయోజనమే మహాకవి గుర్రం జాషువా కవిత్వ ఆశయమని అన్నారు. జాషువా అనేక అవమానాలు ఎదుర్కొన్నా కుంగిపోలేదని కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని తిరగబడ్డారని తెలిపారు. గుంటూరు లేదా పల్నాడు జిల్లాకు జాషువా పేరును పెట్టాలని డొక్కా మాణిక్యవరప్రసాద్ డిమాండ్ చేశారు. నివాళులర్పించిన వారిలో హైకోర్టు న్యాయవాది చందవోలు శోభారాణి, గద్దం ఎలిషా, జేమ్స్ వెంకట్, దర్శనపు శ్రీనివాస్, బాలస్వామి, సుధ, కాకుమాను నాగేశ్వరరావు, సమీర్, ప్రజా సంఘాల నాయకులు జూపుడి శ్రీనివాసరావు, భగత్‌సింగ్, అత్తోట జోసెఫ్, ప్రభాకర్, నల్లపు నీలాంబరం, టి నరసింహారావు, వీరమణి, బాబురావు, చంద్రపాల్, సలీంబాబు ఉన్నారు.



జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్, చెరుకూరి తిరుపతిరావు తదితరులు

బీజేపీ ఆధ్వర్యంలో...

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కవికోకిల దివంగత గుర్రం జాషువాకు బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. జాషువా 130వ జయంతి వేడుకలు ఆదివారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నగరంపాలెంలో జరిగాయి. జాషువా విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ జాషువా అంటరానితనం, కుల, మత విచక్షణపై సాహితీ పోరాటం జరిపారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ, దారా అంబేద్కర్, జాతీయ ఎమ్మార్పీఎస్ నాయకులు సత్యం మాదిగ పాల్గొన్నారు.



గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రక్తదానానికి యువత ముందుకు రావాలి

● జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అవసరాలకు అనుగుణంగా రక్తం నిల్వలు లేకపోవటంతో నిత్యం చాలా మంది చనిపోతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని యువత రక్తదానం చేయటానికి ముందుకు రావాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి కోరారు. బ్రాడీపేట, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో భగత్ సింగ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ప్రారంభోత్సవంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.విజయతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణ యశస్వి మాట్లాడుతూ జీజీహెచ్‌లో 1600 బెడ్స్ ఉంటే 500 బెడ్స్ ఎప్పుడూ రక్తం అవసరం అవుతుందన్నారు. డాక్టర్ విజయ మాట్లాడుతూ 18 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉన్న వారు ఏడాదికి రెండుసార్లు ఎలాంటి అపోహలకూ తావు లేకుండా రక్తం ఇవ్వవచ్చని సూచించారు. కావు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, రమేష్, యశ్వంత్, పాశం రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రమణ యశస్వి వేదికపై డాక్టర్ విజయ తదితరులు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



కిసాన్ డ్రోన్ పంపిణీ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

రైతులు యాంత్రీకరణను అందిపుచ్చుకోవాలి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులు యాంత్రీకరణ పథకాన్ని అందిపుచ్చుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో ఆదివారం కిసాన్ డ్రోన్‌ను లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండల పరిధిలోని వడ్డిముక్కల గ్రామానికి చెందిన శ్రీ అంకమ్మ తల్లి కిసాన్ డ్రోన్ సీహెచ్‌సీ గ్రూప్‌నకు ఎమ్మెల్యే డ్రోన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.9.80 లక్షలు విలువ గల డ్రోన్‌ను రైతులకు ప్రభుత్వ సబ్సిడీ, బ్యాంకు రుణంపై అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని డ్రోన్ల వినియోగం ద్వారా రైతులకు సమయాన్ని, ఖర్చులు ఆదా చేసుకోవచ్చు అని తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న యాంత్రికరణ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం దాదాపు 80 శాతం రాయితీపై 7.84 లక్షలు సబ్సిడీగా గ్రూపు సభ్యుల వాటా రూ.1.96 లక్షలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా వ్యవసాయాన్ని సులభతరం చేసేందుకు కూటమి ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 800కు పైగా గ్రామస్థాయి కిసాన్ సమైక్యలను ఏర్పాటు చేసి రైతులకు డ్రోన్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ వైద్యులకు మధుమేహ వ్యాధిపై సదస్సు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణ వైద్యులకు మధుమేహ వ్యాధిపై ఐదు సెషన్స్‌లో పూర్తి స్థాయిలో ఆదివారం సదస్సు నిర్వహించారు. బోసురోడ్డులోని ఐఎంఏ హాలులో సదస్సును మాజీ ఎమ్మెల్యే, సీనియర్ వైద్యురాలు గోగినేని ఉమ, డాక్టర్ చందు సాంబశివుడు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అప్లైయిడ్ బేసిక్ సైన్స్‌పై రేడియాలజిస్టు వరప్రసాద్, ఎక్కువ రోగాలున్నా రోగికి అందించే వైద్య విధానంపై ఎండోక్రినాలజిస్టు డాక్టర్ అమూల్య, డాక్టర్ జయదేవ్, మైక్రోబయాలజిస్టు డాక్టర్ శిరీష వివరించారు. క్లినికల్ స్కిల్ వర్క్‌షాప్‌ను వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ మహేష్, జనరల్ సర్జన్ డాక్టర్ లక్ష్మీప్రసన్న, న్యూరాలజీ ఎండీ డాక్టర్ దుర్గాహరిప్రసాద్, ఆర్థోసర్జన్ డాక్టర్ కె.అనిల్‌కుమార్, డాక్టర్ వైవీకే దుర్గాప్రసాద్ వివరించారు. డయాబెటిస్ రోగుల పాదాల సమస్యలపై వైద్య విధానంలో వాస్క్యులర్ సర్జన్లు డాక్టర్ విజయ్, డాక్టర్ కిరణ్, డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ శివకృష్ణ ప్రసంగించారు. గాయాల చికిత్స అందించే విధానాన్ని డయాబెటిక్ సర్జన్ డాక్టర్ మనోహర్ష, జనరల్ సర్జన్ డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ సురేష్, డాక్టర్ ప్రతాప్, సంతోష్‌మూర్తి వైద్యులకు అవగాహన కల్పించారు. ఐఎంఏ అధ్యక్షుడు అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు పలువురు పట్టణ వైద్యులు హాజరయ్యారు.



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉమ, డాక్టర్ సాంబశివుడు తదితరులు

మాస్టర్ అథ్లెట్‌కు మానవతా సంస్థ సన్మానం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : 90 ఏళ్ల వయసులో కూడా అథ్లెటిక్స్‌లో పాల్గొని పతకాలు సాధించిన శాఖమూరి మల్లికార్జునరావును మానవతా సంస్థ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఏఎస్ఎన్ కళాశాలలో ఆదివారం జరిగిన సమావేశంలో రీజియన్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, మంచి ఆహారపు అలవాట్లు, నిత్యం వ్యాయామం ఉంటే ప్రతి ఒక్కరూ వందేళ్ల వరకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా జీవిస్తారని చెప్పారు. సమాజంలో సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయడమే కాకుండా ఆదర్శంగా జీవించే వారిని కూడా సంస్థ గుర్తించి సత్కరిస్తుందన్నారు. డిగ్రీ చదువుతున్న ప్రతిభ కలిగిన విద్యార్థులు శివాని, తాస్రీమ్, చందు, ఖాదర్‌లకు రూ.20 వేల సాయం అందజేశారు. వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొలసాని రాంచంద్, ముత్తేవి రవీంద్రనాథ్, మల్లాది అర్జున, అప్పారావు, జగదీశ్వరి, సత్యనారాయణ, ఆలపాటి వెంకట్రామయ్య, మొవ్వా సత్యనారాయణ, వాసు, వెంకట్, ప్రసాద్, శర్మ పాల్గొన్నారు.



మల్లికార్జునరావును సన్మానిస్తున్న మానవతా సభ్యులు

నవయుగ కవి జాషువా జయంతి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నవయుగ కవి గుర్రం జాషువా జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. బస్ స్టేషన్ వద్ద జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ సీనియర్ నాయకులు అనంతచార్యులు మాట్లాడుతూ, తెలుగు కవులలో అగ్రస్థానం పొందిన జాషువా సమాజాన్ని మేల్కొలిపారని చెప్పారు. మూఢాచారాలను ఎదుర్కొని ఛీత్కారాలు పొందిన చోటే సత్కారాలు కూడా పొందారని చెప్పారు. తన సృజనాత్మక శక్తితో బాల్యం నుండే పాటలు పాడటం, రచనలు చేయడం అలవడిందన్నారు. ఆయన రచనల్లో సర్వోత్తమమైన గ్రంథం గబ్బిలం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కఠారి వాసుదేవనాయుడు, పినపాటి రవికుమార్ పాల్గొన్నారు.

● గుర్రం జాషువా విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో 130వ జయంతి సభ ఆదివారం కవిరాజా పార్కులో నిర్వహించారు. పినపాటి రవికుమార్ అధ్యక్షతన జరిగిన సభలో జాషువా రచనా వైభవాన్ని పలువురు వక్తలు ప్రసంగించారు. జె. న్యూటన్‌కు 2025కు జాషువా పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో మురళీధర్, గంటయ్య, రాజారామ్, సుందరరావు, సుధీర్‌బాబు, బాలస్వామి, అమలకుమారి, సుకుమార్, సుబ్బారావు, కనపర్తి బెన్‌హర్, ప్రసాద్ పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు దుస్తుల పంపిణీ కార్యక్రమం పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో జరిగింది. సాయినగర్ షిర్డీ సాయి మందిరంలో షిర్డీ సాయిబాబా సేవా సంఘం ఆధ్వర్యంలో సాయి పుణ్యతిథి దినోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సాయి పుణ్యతిథి ఉత్సవాలు పురస్కరించుకొని మందిరంలో సాయిబాబాకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మహిళల చేత సామూహిక కుంకుమార్చన జరిపారు. అనంతరం 40 మంది పేదలకు దుస్తుల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షిర్డీ సాయిబాబా సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భగత్ సింగ్‌కు ఘన నివాళి

పొన్నూరుటౌన్, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. పొన్నూరు పట్టణంలో ఆదివారం భగత్ సింగ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్ సింగ్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి నాయకులు పులిపాటి రాజు, షేక్ నజీమ్ బాబు, సాజిత్ పాల్గొన్నారు.

జగజ్జననికి.. జేజేలు

● వేడుకగా దేవీ నవరాత్రులు..
● కనువిందు చేస్తున్న అమ్మవారి అలంకరణలు
● అధిక సంఖ్యలో దర్శించుకుంటున్న భక్తులు




చండీ హోమం చేస్తున్న సాయి గురూజీ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో దసరా నవరాత్ర ఉత్సవాలలో అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకారాలు గావించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలను దర్శించి పూజలు, హోమాలలో పాల్గొన్నారు. ఆదివారం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు. బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో శ్రీవాసవీ అమ్మవారిని ప్రత్యంగిరాదేవిగా, రాజరాజేశ్వరి అమ్మవారిని భద్రకాళిదేవిగా అలంకరించి 25 మంది ఉభయ దాతల దంపతులు పూజలు చేశారు. చండీ హోమం నిర్వహించారు. తేజస్వి ప్రఖ్య బృందం



మారీసుపేటలో వారాహిదేవి అలంకారం



వాసవీ ఆలయంలో ప్రత్యంగిరాదేవి అలంకారం


మోహిని భస్మాసుర నృత్య రూపకంతో అలరించారు. మారీసుపేట శివాలయంలో అమ్మవారిని పంచముఖ వారాహిదేవిగా అలంకరించి 23 మంది ఉభయ దాతలు పూజలు చేశారు. భానుమతి బృందం బుర్రకథ వినిపించారు. దేవీచౌక్‌లో రాజరాజేశ్వరి అమ్మవారిని మహా వారాహిదేవిగా అలంకరించి ఉభయ దాతలు పూజలు చేశారు. నిర్మలా రమేష్ శిష్యబృందం కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శించారు. రామలింగేశ్వరపేట రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని పర్వతవర్ధినిగా అలంకరించారు. చంద్రబాబు నాయుడు కాలనీలో విజయదుర్గ అమ్మవారికి భక్తులు కుంకుమ పూజలు చేశారు. నందులపేట సాయి అనుగ్రహ పీఠంలో సాయి గురూజీ చండీ హోమం నిర్వహించారు. పాత శివాలయం, అప్పలస్వామి ఆలయంలో చండికాదేవిగా అమ్మవారిని అలంకరించారు. గంగానమ్మపేట బాలత్రిపురసుందరి ఆలయం, చినరావూరు సోమేశ్వరాలయం, నందివెలుగు, పెదరావూరు శివాలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పలు ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన రంగు రంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా వెలుగొందుతున్నాయి.

● కొల్లిపర, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు దేవాలయాల్లో విజయదశమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత శ్రీజనార్ధనస్వామి దేవాలయంలో శ్రీకాళికాదేవి, శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో శ్రీభద్రకాళిదేవి, ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శ్రీమహాచండీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో చిన్నారులను వివిధ రూపాల్లో అమ్మవారిలాగా విచిత్రవేషదారణలో అలంకరణ చేసి తీసుకురావటంతో భక్తులను ఆకట్టుకున్నారు. అదే విధంగా మండలంలోని వల్లభాపురం, కుంచవరం, మున్నంగి, పిడపర్రు, తూములూరు, దావులూరు, హనుమాన్‌పాలెం, అత్తోట, అన్నవరం, చివలూరు గ్రామాల్లోని శివాలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



కొల్లిపర శ్రీజనార్ధనస్వామి ఆలయంలో శ్రీకాళికాదేవి అలంకరణలో అమ్మవారు

● పెదకాకాని, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల శ్రీ దశావతార వేంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రంలో ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో ఆదివారం అమ్మవారు సంతాన లక్ష్మీ అలంకారంతో భక్తులకు దర్శనం ఇచ్చారు. నిత్యం ఆలయంలో జరిగే భక్తి కార్యక్రమం లో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు భక్తులకు విజ్ఞప్తి చేశారు.



సంతాన లక్ష్మి అలంకారంలో మహాలక్ష్మి అమ్మవారు

● పొన్నూరుటౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా అమ్మవారి విభిన్న రూపాల అలంకారాలు భక్తులను విశేషంగా అలరిస్తున్నాయి. ఆదివారం పట్టణ శివారులోని జీబీసీ రోడ్డులో ఉన్న కనకదుర్గ భవాని ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారు కాత్యాయిని దేవిగా భక్తుల పూజలు అందుకుంది. అలాగే భావనారాయణ స్వామి ఆలయంలో కొలువుదీరిన కాశీ విశాలాక్షమ్మ మహా చండీదేవిగా భక్తులను అలరించింది. పట్టణంలోని శ్రీ సహస్రలింగేశ్వర స్వామి ఆలయంలోని పార్వతీదేవి, వాసవి కన్యకా పరమేశ్వరి శ్రీ తోటమ్మ తల్లి తదితర ఆలయాలతో పాటు పలు నవరాత్రి మండపాల్లో కొలువుదీరిన అమ్మవారు వివిధ రూపాలలో భక్తులను అలరించి అభయమిచ్చారు. నవరాత్రి అలంకారాలను వీక్షించి పూజించేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు.



మహా చండీ దేవిగా దర్శనమిస్తున్న విశాలాక్షమ్మ

అమ్మవారికి సారే సమర్పించిన భక్తులు

చేబ్రోలు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు మండలం శేకూరు గ్రామంలో దుర్గానవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి భక్తులు సారే సమర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు మేళ తాళాలతో ఊరేగింపుగా పాల్గొన్నారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో తలపై పొంగళ్ళు, బోనాలను మోసుకొంటూ, యువకుల జయజయధ్వానాలతో ఊరేగింపుతో అలరించారు. భక్తులు ప్రత్యేక పూజలు జరిపి అమ్మవారికి సారే సమర్పించారు. భక్తిగీతాల నడుమ జరిగిన ఈ ఊరేగింపు గ్రామమంతా పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది. ఈ కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మంత్రి మనోహర్



భవానీలతో ఎమ్మెల్యే నరేంద్రకుమార్

ఆలయాల్లో మనోహర్, నరేంద్ర పూజలు

కొల్లిపర, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అత్తోటలో దసరా ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఏడవ రోజైన ఆదివారం శివాలయంలో అమ్మవారిని శ్రీమహాచండీదేవిగా అలంకరించడంతో మహిళలు పసుపు, కుంకుమలతో పూజలు చేసి తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శివాలయంలో, గ్రామంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని పండితులు వివిధ రూపాల్లో అలంకరించడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మనోహర్‌కు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దివ్వెల ఏడుకొండలు, బొల్లిముంత వెంకటేశ్వరరావు, కొఠారు అంజనేయులు, దాసరి నరసయ్య, విష్ణుమొలకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నందివెలుగు ఆలయంలో...

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రూరల్ మండలం నందివెలుగులోని కనకదుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రిని కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి పూజల్లో పాల్గొన్న మంత్రిని ఆశీర్వదించి ప్రసాదాలు అందజేశారు. గ్రామంలో ఘనంగా దసరా ఉత్సవాలు చేస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. ఆయనతో పాటు జనసేన నేత గాదె వెంకటేశ్వరరావు, పలువురు పార్టీ నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. తెనాలి పట్టణంలోని శివాజీచౌక్ కాళీమాత ఆలయం వద్ద నిర్వహిస్తున్న ఉత్సవాల్లో మంత్రి మనోహర్‌కి కమిటీ అధ్యక్షుడు గుమ్మడి రమేష్, కార్యదర్శి శ్రీనివాసరావు స్వాగతం పలికారు. బోసు రోడ్డులోని శ్రీ వాసవీ ఆలయానికి వచ్చిన మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి పూజల్లో పాల్గొన్న మంత్రికి కమిటీ ప్రతినిధులు ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో మునగాల మోహన్ శ్యాంప్రసాద్, పెండెల వెంకట్రావు పాల్గొన్నారు.

శలపాడులో...

చేబ్రోలు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో శ్రీ దుర్గాభవాని ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఆదివారం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొన్నారు. భక్తులతో కలసి అమ్మవారిని దర్శించుకుని పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ నవరాత్రులు ఆధ్యాత్మిక శక్తికి ప్రతీకలని, సామాజిక సత్సంకల్పాలకు ప్రేరణనిచ్చేవని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హిందూ సంప్రదాయంలో వేదపారాయణం పవిత్రం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : హిందూ సంప్రదాయంలో వేదపారాయణ ఎంతో పవిత్రమైనదని, ధార్మిక, ఆధ్యాత్మిక శక్తిని పెంపొందిస్తుందని టీటీడీ వేద పాఠశాల ప్రిన్సిపల్ కె.శివసుబ్రహ్మణ్య అవధాని చెప్పారు. వేదిక బ్రాహ్మణ సేవా సమాఖ్య భవనంలో ఆదివారం వేద పారాయణ చేశారు. ఆయన మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలలో చేసే పారాయణ దైవానుగ్రహం సంపూర్ణంగా లభిస్తుందన్నారు. 50 మంది వేద పండితులు పారాయణలో పాల్గొన్నారు. ఆంజనేయ చయనులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సామవేదం సత్యనారాయణ, సూర్యనారాయణమూర్తి, సుబ్రహ్మణ్యం, తిరుమలరావు, వేణుగోపాల్, శ్రీనివాసమూర్తి, శివకుమార్ పాల్గొన్నారు. పండితులను ఘనంగా సన్మానించారు.

అత్యవసర సమయాల్లో సమాచారం అందించాలి

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో ప్రజలు 100, 112 నంబర్లకు సమాచారం అందిస్తే సహాయం అందుతుందని అర్బన్ సీఐ ఎల్.వీర నాయక్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ సెంటర్లో ఆదివారం డయల్ 100, 112 నంబర్లపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఫోన్ చేస్తే తక్షణ సహాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పట్టణ వాసులు పాల్గొన్నారు.

హంసవాహనంపై ఊరేగిన శ్రీగంగానమ్మతల్లి

దుగ్గిరాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామం చిలువూరు శ్రీగంగానమ్మ దేవతాలయ వార్షికోత్సవాల్లో రెండోరోజు ఆదివారం అమ్మ వారు హంసవాహనంపై గ్రామవీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. అమ్మవారి గీతాలాపన, సాంప్రదాయ డప్పులు, అమ్మవారి పాటలకు గ్రామవీధుల్లో యువనృత్య కళాకారిణులు, డప్పువాద్యాలతో కొనసాగిన ఊరేగింపుతో గ్రామంలో కోలాహలం నెలకొంది. 29న గంగానమ్మదేవతకు పుష్పార్చన, 101చీరెలు, లక్షగాజులతో అలంకరణ, పూజాకార్యక్రమాల అనంతరం గ్రామంలో వేలాది మందికి అన్నసంతర్పణ నిర్వహించనున్నారు.



చిలువూరులో హంసవాహనంపై ఊరేగుతున్న శ్రీగంగానమ్మ దేవతామూర్తి



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 2000-2001 పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చేబ్రోలు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్సీ 2000-2001 బ్యాచ్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. పాఠశాలలో చదివిన రోజులు జీవితానికి పునాది అయ్యాయని వారు గుర్తుచేసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, పూర్వ విద్యార్థులు సమ్మేళనం కోసం రావడం హర్షణీయమని, విద్యార్థులు సమాజంలో మంచి స్థాయికి చేరుకోవడం పాఠశాల గౌరవాన్ని పెంచిందన్నారు. పూర్వ విద్యార్థులు కృష్ణకాంత్, ప్రవీణ్, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరగటం ఆనందంగా ఉందని విద్యార్థులు తెలిపారు.

● చేబ్రోలు శ్రీ రాఘవేంద్ర ట్యుటోరియల్స్‌లో చదువుకున్న 1993-1994 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం చేబ్రోలులోని సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని జరుపుకున్నారు. విద్యనేర్పిన గురువులైన నజీర్‌చాంద్, శ్రీనివాసరావు, మూర్తిలను ఘనంగా సన్మానించారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగించాలి: డీవైఎఫ్ఐ

మంగళగిరి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీషు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భగత్‌సింగ్ చేసిన కృషి మరువలేనిదని, ఆయన ఆశయాలను నేటి యువత కొనసాగించాలని డీవైఎఫ్ఐ నేత ఎం.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆదివారం మంగళగిరి గాలిగోపురం సెంటరులోని భగత్‌సింగ్ విగ్రహానికి డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్.గణేష్, ఎం.బాలాజీ, శివ, అబ్దుల్ హుస్సేన్, సీపీఎం నేతలు జేవీ రాఘవులు, వీ.బాలకృష్ణ, కే.బుజ్జిబాబు పాల్గొన్నారు.

భూ సేకరణలో అభ్యంతరాలుంటే తెలియజేయాలి: తహసీల్దార్

పెదనందిపాడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు చానెల్ పొడిగింపునకు సంబంధించిన భూసేకరణలో అభ్యంతరాలుంటే రైతులు తెలియజేయాలని తహసీల్దార్ హేనాప్రియ ఆదివారం తెలిపారు. మండల పరిధిలోని రావిపాడులో సోమవారం రైతులతో ఆర్డీవో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

100, 112పై అవగాహన సదస్సు

ఫిరంగిపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అత్యవసర ఫోన్ కాల్స్ అయిన 100, 112లపై అవగాహన కలిగి ఉండాలని ఫిరంగిపురం సీఐ శివరామకృష్ణ అన్నారు. ఈ నంబర్లను డయల్ చేసిన వెంటనే పోలీసు స్టేషన్‌కు సమాచారం అందుతుందని, దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రక్షణ సదుపాయం కల్పిస్తారని ఆయన చెప్పారు. ఆదివారం మండలంలోని వేములూరిపాడులో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ పి.సురేష్ పోలీసు సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు ఆదివారం 4,513 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజి వద్ద 15.8 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 6,32,691 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ చానల్‌కు 200, రేపల్లె కాల్వకు 1,552, తూర్పు కాల్వకు 454, పశ్చిమకాల్వకు 188, నిజాంపట్నం కాల్వకు 351, కొమ్మమూరు కాల్వకు 2,120 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

వైసీపీ డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తల కోసం ఆ పార్టీ అధిష్ఠానం రూపొందించిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను మంగళగిరి వైసీపీ కార్యాలయంలో ఆదివారం నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ, వైసీపీ కార్యకర్తలు డిజిటల్ బుక్ స్కానర్ ద్వారా ప్రతి ఒక్కరూ తమకు జరిగిన అన్యాయాలను పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు బుర్రముక్క వేణుగోపాలస్వామిరెడ్డి, నాలి వెంకటకృష్ణ, తాడిబోయిన శివగోపయ్య, అమరా నాగయ్య, పచ్చల రత్నకుమారి, ఫిలోమిని, డేవిడ్‌రాజు, వూట్ల పాలశ్రీనివాసరావు, ఈపూరి ఆదాం, సుబ్బారావు, దర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీజీవో ప్రత్తిపాడు అధ్యక్షుడిగా శేషగిరిరాజు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ ప్రత్తిపాడు అధ్యక్షుడిగా కె.శేషగిరిరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ప్రత్తిపాడులోని పశువైద్యశాలలో ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు మండలాల పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులు ఏకగ్రీవంగా అసోసియేషన్ కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షుడిగా కె.సుగన్యరావు, ఉపాధ్యక్షులుగా జీవీ లలితాదేవి, ఆర్.విజయరాణి, పి.శ్రీనివాసరావు, కార్యదర్శిగా పాల్‌ప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా పి.కోటేశ్వరమ్మ, సీహెచ్.శ్రీనివాసరావు, తోట మహేశ్, మహమ్మద్, కోశాధికారిగా జి.నాగేశ్వరరావు ఎన్నికయ్యారు.

సునీల్ చౌదరికి పితృ వియోగం


నువ్వుల చిరంజీవి (ఫైల్ ఫొటో)

కాకుమాను, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు నువ్వుల సునీల్ చౌదరి తండ్రి నువ్వుల చిరంజీవి (84) ఆదివారం అనారోగ్యంతో పొన్నూరు పట్టణంలో తుది శ్వాస విడిచారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి చిరంజీవి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. సోమవారం చిరంజీవి అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుమారులు తులసీరామ్, సునీల్ చౌదరి తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● బీజేపీ నేత అబ్దుల్ ఖుద్దూస్

కాకుమాను, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు షేక్ అబ్దుల్ ఖుద్దూస్ అన్నారు. మండల కేంద్రమైన కాకుమానులో పూర్ణా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో ఆదివారం జరిగిన సమావేశంలో అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న మహిళలు ఉజ్వల 3.0 పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. గ్యాస్ కనెక్షన్ లేని పేదలు ఉజ్వల పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్సులతో స్థానిక గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను సంప్రదించాలన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు శ్రీధర్ శర్మ, ఆదిలక్ష్మి ఉన్నారు.

కన్నుల పండువగా అలంకారాలు


తుళ్లూరు: మహాచండీ దేవీ అలంకారంలో పెదపరిమి అమ్మవారు


మంగళగిరి: కాత్యాయనీ దేవిగా కనకదుర్గమ్మ, ధనలక్ష్మీ అలంకారంలో రాజ్యలక్ష్మీ, మహాచండీగా అఖిలాండేశ్వరీ అమ్మవారు


దుగ్గిరాల: శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీఅమ్మవారు


తాడికొండలో ధనలక్ష్మీ, శ్రీ మహాచండీ దేవి అలంకారంలో అమ్మవారు

శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారి అలంకారంలు ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. అమ్మవారి మండపాల వద్ద హోమాలు నిర్వహించారు.
- ఆంధ్రజ్యోతి


వట్టిచెరుకూరులో దుర్గాదేవిగా ..


దుగ్గిరాలలో..

వరద ముంపు

● అరటి, పసుపుతోటలు మునక
● ముంపు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా


పెదకొండూరు వద్ద అరటి తోటను ముంచెత్తుతున్న వరదనీరు


నదీతీర ప్రాంత వాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

దుగ్గిరాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి భారీగా నీటిని విడుదల చేస్తుండటంతో కృష్ణానది కరకట్టలోపలి వైపునున్న పొలాల్లోకి వరద నీరు చేరుతోంది. ఇప్పటికే వీర్లపాలెంలోని పలుపంట పొలాల్లోకి నీరుచేరగా వాణిజ్యపంటలు అధికంగా పండించే పెదకొండూరులోని పసుపుతోటలు, అరటితోటలు వరదనీటిలో మునిగిపోతున్నాయి. వరద మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గొడవర్రు వద్ద ఏటి ఒడ్డునగల తిరుపతమ్మతల్లి ఆలయ ప్రాంగణాన్ని ఇప్పటికే వరదనీరు చుట్టుముట్టింది. అర్ధరాత్రికి వరద మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందని చెబుతుండటంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు చేశారు. నదిలోకి వెళ్లవద్దని పంచాయతీ, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో ప్రజలకు, మత్స్యకారులకు, పశువుల కాపరులను హెచ్చరించారు. వరద పరిస్థితిని పరిశీలించి వీఆర్వో, ఇతర శాఖల అధికారులను అప్రమత్తం చేశామని తహసీల్దార్ ఐ.సునీత తెలిపారు.

● తాడేపల్లి: తాడేపల్లి మండలం చిర్రావూరు నదీతీర ప్రాంతంలో కరకట్ట వద్ద పంట పొలాలు నీటమునిగాయి. కృష్ణానది నుంచి భారీగా దిగువకు వరద నీరు వస్తుండడంతో పల్లపు ప్రాంతమైన చిర్రావూరు కరకట్ట ప్రాంతాలలో ఆదివారం దాదాపు 50 ఎకరాలలో పంట పొలాలు నీట మునిగాయి. కరకట్ట తీరంలోని మినుము, బెండ, సొర చేలు నీటమునిగాయి. కృష్ణానది లంకల్లో సుమారు 100 ఎకరాల పంట పొలాలు వరదల వల్ల నీటమునిగాయని రైతులు చెబుతున్నారు. కృష్ణానదికి వచ్చే వరదల వల్ల తమ పంట పొలాలు నీట మునిగి నష్టం వాటిల్లుతోందని వారు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కరకట్ట ప్రాంత పంట పొలాల రైతులు కోరుతున్నారు.


చిర్రావూరు కరకట్ట వద్ద నీటమునిగిన బెండ చేను

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి భారీగా వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని స్థానిక అధికారులను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఎగువ నుంచి భారీగా వరదనీరు విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి అధికారులతో కలిసి ఆదివారం వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం బ్యారేజి ఎగువ, అమరావతి కరకట్ట దిగువ సీతానగరం మహానాడు, వారధి వద్ద నదీతీర ప్రాంతాల్లో నివసిస్తున్న వారి వద్దకు వెళ్లి మాట్లాడారు. అధికారులకు సహకరించాలని, నది ఒడ్డున నివాసం ఉండే వారు ఖాళీ చేయాలని సూచించారు. సీతానగరం రైలు వంతెనల నుంచి వారధి సమీపం వరకు నది ఒడ్డున ఉన్న వారికి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య జిల్లా కలెక్టర్‌కు వివరించారు.

పునరావాస కేంద్రాలకు తరలివెళ్లండి

తుళ్లూరు, సెప్టెంబరు 28: వరద ప్రభావిత ప్రాంతాలైన తుళ్లూరు మండలం తాళ్ళయ్యపాలెం లంక, ఉద్దండరాయ పాలెం లంక, తాడేపల్లి మండలం కృష్ణ ఒడ్డు మహానాడు కాలనీ, కరకట్ట ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఉద్దండరాయ పాలెం లంక గ్రామాన్ని పడవపై వెళ్లి పరిశీలించారు. గ్రామంలో ద్విచక్ర వాహనంపై పర్యటించారు. కృష్ణా నదిలో వరద పెరిగే అవకాశం ఉందని స్థానికులు తక్షణం పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని కోరారు. పునరావాస కేంద్రాలకు వెళ్ళటానికి వాహనాలు ఏర్పాటు చేశామని, ప్రజలు ముందు జాగ్రత్తగా తరలివెళ్లాలని అన్నారు. తాళ్ళయ్యపాలెంలో ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. ఘాట్‌ల వద్ద భవానీ భక్తులు, ఇతరులు స్నానాలు ఆచరించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నదిలో చేపలు పట్టడం, పశువులను వదలడం వంటి చర్యలు చేయవద్దని కోరారు. జిల్లాలో ఐదు మండలాల్లో 16 గ్రామాలు వరద ప్రభావిత గ్రామాలుగా గుర్తించామని జిల్లా కలెక్టర్ చెప్పారు. వరదల పరిస్థితిపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 0863- 2234014 ఫోన్ నంబరుకు సమాచారం అందించవచ్చని ఆమె చెప్పారు. ఉద్దండరాయపాలెం లంక గ్రామ ప్రజలు మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాల నుంచి వరద ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. సురక్షిత ప్రాంతాల్లో తమకు స్థలాలు కేటాయించి తరలించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, డీఎస్పీటీ మురళి కృష్ణ, తహసీల్దార్లు, ఇతర శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ తల్లి జాతర

● హోరెత్తిన చిలువూరు ● హంస వాహనంపై ఊరేగింపు

దుగ్గిరాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామం చిలువూరులో గంగానమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. తప్పెట్లు, తాళాలు, బాజాలతో గ్రామం హోరెత్తిపోయింది. అమ్మవారి పాటలకు యువతుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం అమ్మవారు హంసవాహనంపై గ్రామవీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. గ్రామవీధుల్లో హంసవాహనంపై వెళుతున్న అమ్మవారి ఊరేగింపుపై డ్రోన్‌తో పూలవర్షం కురిపించారు. ఆలయ శాశ్వత కైంకర్యపరులు డాక్టర్ రంగిశెట్టి జగదీష్‌బాబు సుభాషిణి దంపతులు, డాక్టర్ రమేష్‌బాబు, సురేష్‌బాబు సోదరులు, సింగలూరు వీరన్న పద్మజ్యోతి దంపతులు ఇతర కుటుంబసభ్యులు తమ ఇంటి నుంచి పొంగళ్లను తీసుకుని ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి సమర్పించారు. సోమవారం గంగానమ్మదేవతకు పుష్పార్చన, 101 చీరెలు, లక్షగాజులతో అలంకరణ, పూజా కార్యక్రమాలు జరపనున్నారు. అనంతరం గ్రామంలో వేలాది మందికి అన్నసంతర్పణ నిర్వహించనున్నారు.


చిలువూరులో హంసవాహనంపై ఊరేగుతున్న శ్రీగంగానమ్మ, భక్తిగీతాలకు నృత్యాలు చేస్తున్న యువతులు

జాషువాకు ఘన నివాళి


మంగళగిరిలో జాషువా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు

మంగళగిరి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా కలం పట్టి ఉద్యమించిన యోధుడు గుర్రం జాషువా అని పలువురు ప్రజా సంఘాల నేతలు పేర్కొన్నారు. నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 130వ జయంతిని పురస్కరించుకుని ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి సీపీఐ కార్యాలయంలో జాషువా చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. కంచర్ల కాశయ్య అధ్యక్షతన జరిగిన సభలో పలువురు నేతలు మాట్లాడుతూ, తెలుగు సాహిత్యం ద్వారా సామాజిక సమానత్వం, కులవివక్ష నిర్మూలన, మానవతా విలువల కోసం జాషువా పోరాడిన తీరును కొనియాడారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు రేఖా కృష్ణార్జునరావు, అల్లక తాతారావు, గోలి మధు, కె.ప్రభాకర్, చిన్ని తిరుపతయ్య, జాలాది జాన్‌బాబు, కారుమంచి రామారావు, గుజ్జర్లపూడి జాన్‌బాబు, కుర్రా శ్రీనివాసరావు, పొట్లాబత్తుని లక్ష్మణరావు, గోవిందు, శిఖా సురేష్, చిన్ని సత్యనారాయణ, జే.శంకరరావు, పంతగాని మరియదాసు పాల్గొన్నారు.

● తాడేపల్లి: తన రచనలతో సమాజాన్ని మేల్కొలిపి సమసమాజ స్థాపనకు కృషి చేసిన నవయువ కవిచక్రవర్తి గుర్రం జాషువ అని తాడేపల్లి మండల సీపీఎం సీనియర్ నేత దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం తాడేపల్లి మండలం గుండిమెడలో గుర్రం జాషువ 130వ జయంతిని మండల సీపీఎం కార్యదర్శి పల్లె కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. జాషువ చిత్రపటానికి నేతలు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం గుండిమెడ శాఖ కార్యదర్శి నాగపోగు విజయరాజు, బత్తుల సంసోను, బి బాబూరావు, నాగరాజు, చిన్న, గురవయ్య, కోటేశ్వరరావు, బాబూరావు పాల్గొన్నారు.

● కుంచనపల్లి అంబేడ్కర్ సెంటర్‌లో గుర్రం జాషువ 130వ జయంతిని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత జాషువ చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పల్లె కృష్ణ, నల్లపు కిషోర్‌బాబు, అమ్మిశెట్టి రంగారావు, శ్యామల, దయామణి, వెంకటరమణ, లెనిన్, దానియేలు, రాజారావు పాల్గొన్నారు.

● తాడేపల్లి టౌన్: తాడేపల్లిలోని గుర్రం జాషువ సేవాసమితి కార్యాలయంలో గుర్రం జాషువ 130వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు దర్శనపు శామ్యూల్ మాట్లాడుతూ, కులవ్యవస్థకు వ్యతిరేకంగా జాషువ పోరాడారన్నారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, డైరెక్టర్ పెరికే బాబు, శ్రీరాములు, శ్రీను, శ్రీనివాస్, కోటేశ్వరరావు, రాంబాబు, వెంకటరెడ్డి, బండి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గిరాల: జాషువా కళా పరిషత్ వ్యవస్థాపకుడు డాక్టర్ పెద్దేటి యోహాను ఆధ్వర్యంలో మండల కేంద్రం దుగ్గిరాలలో ఆదివారం గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రం జాషువా విగ్రహానికి షేక్ సుభాని, పలువురు గ్రామస్తులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం నాయకులు జెట్టి బాలరాజు, గొర్రిపాటి శ్రీనివాసరావు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

● పెదనందిపాడు: స్థానిక గ్రంథాలయంలో గుర్రం జాషువా జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి ఎస్టీయూ రాష్ట్ర కౌన్సెలర్ గేరా మోహనరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు డి.శివనాగేశ్వరరావు, వార్డు సభ్యులు వెలినేని శివయ్య, మంజుల, తదితరులు పాల్గొన్నారు.


ప్రకాశం బ్యారేజీపైకి వాహనాలు వెళ్లకుండా అడ్డుపెట్టిన బ్యారికేడ్లు

ప్రకాశం బ్యారేజీపై వాహన రాకపోకల నిలిపివేత

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం భక్తుల రద్దీ పెరిగే అవకాశమున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీపైకి వాహనాల రాకపోకలను నిలిపివేసినట్టు తాడేపల్లి ఎస్ఐ ప్రతాప్ తెలిపారు. దర్శనానికి వెళ్లే భక్తులను నడిచి వెళ్లడానికి, ఉత్సవ విధులు నిర్వహించే సిబ్బందిని డ్యూటీ పాస్‌లు ఉంటే బ్యారేజీపైకి అనుమతిస్తున్నారు. మంగళగిరి తాడేపల్లి అమరావతి వైపు నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనదారులు కనకదుర్గమ్మ వారధి మీదుగా రాకపోకలు సాగించాలని ఎస్ఐ కోరారు.

పెదకొండూరులో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు

దుగ్గిరాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామం పెదకొండూరు రామాలయం వద్ద బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ పూజా కార్యక్రమాల అనంతరం ఏటివద్దకు వెళ్లి భక్తిశ్రద్ధలతో బతుకమ్మను కృష్ణమ్మ ఒడిలోకి చేరుస్తున్నారు. కృష్ణమ్మ శాంతించాలని పాడిపంటలను కాపాడాలని వేడుకుంటూ పూజలు నిర్వహిస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో జెండా ఎగరవేస్తాం

● ఎమ్మెల్యే రామాంజనేయులు


మండల పార్టీ అధ్యక్షుడు శ్రీరఘురామారావుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

పెద నందిపాడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. మండల పరిధిలోని నాగులపాడు ఉపమార్కెట్ యార్డులో మండల టీడీపీ అధ్యక్ష, ఏబీపాలెం పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీఎస్టీ తగ్గించిన ఘనత ఎన్డీయే కూటమికి దక్కుతుందన్నారు. అనంతరం మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య మాట్లాడుతూ, నాయకులు కలిసికట్టుగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. పార్టీలో కష్టపడ్డవారికి ప్రాధాన్యం ఇవ్వకుంటే పార్టీ నష్టపోతుందని హెచ్చరించారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన కోడూరి శ్రీరఘురామారావు, ఏబీపాలెం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన స్వయంపు పార్వతి, పర్సన్లుగా ఎన్నికైన కట్టా డేవిడ్‌రాజు, షేక్ సాంబయ్య, తెలుగు మహిళా అధ్యక్షురాలిగా ఎన్నికైన చిన్నం ఈశ్వరమ్మలతో ఎమ్మెల్యే రామాంజనేయులు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు అన్నాబత్తుని జయలక్ష్మీ, నియోజకవర్గ పరిశీలకురాలు భీమినేని వందనాదేవి, మీడియా కో ఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి చెరువుకు భూమి కేటాయించాలని వినతి

మండల పరిధిలోని నాగులపాడులో అదనపు తాగునీటి చెరువు ఏర్పాటుకు భూమిని కేటాయించాలని కోరుతూ గ్రామస్థులు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. బాపట్ల రోడ్డు వెంట ఉన్న సర్వే నెం.343-1బీలో ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమిని తాగునీటి అవసరాలకు కేటాయించాలని కోరారు. గ్రామస్థులు బండి నాగేశ్వరరావు, ఆళ్ల వెంకట్, ఎస్. శ్రీనివాసరావు, ఆళ్ల రాజారావు తదితరులు పాల్గొన్నారు.


జ్యోతికి ఆర్థికసాయం అందజేస్తున్న మేయర్ నాని, మిత్ర మండలి సభ్యులు

'జ్యోతి'కి మేయర్ నాని రూ.65 వేల సాయం

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు గ్రామానికి చెందిన దివ్యాంగ మహిళ పాములపాటి జ్యోతికి మేయర్ నాని మిత్ర మండలి ఆధ్వర్యంలో గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని) రూ.65 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఇటీవల ఆంధ్రజ్యోతి దిన పత్రికలో జ్యోతి దీనగాథ ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో మేయర్ నాని జ్యోతికి ఆర్థిక సాయం అందజేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం అశోక్‌నగర్ ఒకటో లైన్‌లోని క్యాంప్ కార్యాలయంలో మేయర్ నాని మిత్రమండలి నేత కడప సాయి, అయన స్నేహితులు.. జ్యోతికి రూ.65వేల నగదు, చీరలు మేయర్ రవీంద్ర చేతుల మీదుగా అందించారు. జ్యోతి కుమారుడు రక్షణ కుమార్‌కు చదువు నిమిత్తం ప్రతి ఏడాది స్కూల్ ఫీజును తాము కడతామని కడప సాయి ఈ సంద్భంగా హామీ ఇచ్చారు. మేయర్ రవీంద్ర మాట్లాడుతూ, జ్యోతికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ స్పందనతో గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం లభించిందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కసుకుర్తి హనుమంతరావు, అనిల్, నాగూర్ పాల్గొన్నారు.

ప్రకటనలకే పరిమితమైన చేనేత టెక్స్‌టైల్ పార్కు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ పార్కును రెండు నెలల్లో ప్రారంభిస్తామని ఇటీవల చేనేత జౌళి శాఖ మంత్రి సవిత చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు విమర్శించారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 11 నుంచి ప్రారంభమైన చేనేత అధ్యయన యాత్ర కడప జిల్లాలో టెక్స్‌టైల్ పార్కును పరిశీలించిందని చెప్పారు. అక్కడ 50 ఎకరాల్లో 93 యూనిట్లు స్థాపించాలనే లక్ష్యంతో 15 సంవత్సరాల క్రితం ఒక్కొక్కరికి 25 సెంట్ల చొప్పున కేటాయించారని, ఇప్పటివరకు ఒక్క యూనిట్‌ను కూడా ప్రారంభించలేదని తెలిపారు. విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థ, ప్రహరీ వంటి మౌలిక వసతులు లేకపోవడంతో యూనిట్లు పెట్టేందుకు ఎవ్వరూ ముందుకు రావడంలేదన్నారు. ప్రభుత్వం కనీసం రూ.పది కోట్లు విడుదలు చేస్తేనే ఆర్నెలల్లో యూనిట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. వెంకటగిరి సమీపంలోని బంగారుపేటలో పదేళ్ల క్రితం కేటాయించిన 60ఎకరాల భూమిని స్థానిక నేతలు ఆక్రమించుకున్నారని, ప్రభుత్వం వెంటనే ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

నేడు పునీత మిఖాయేలు వారి మహోత్సవం

మంగళగిరి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం పెదవడ్లపూడి విచారణ పరిధిలోని పునీత మిఖాయేలు వారి పండుగ మహోత్సవం సోమవారం జరుగుతుందని పెదవడ్లపూడి విచారణ గురువు రెవరెండ్ నల్లపాటి శౌరి, సెయింట్ మైఖేల్స్ బోర్డింగ్ రెక్టర్ రెవరెండ్ చాట్ల మరియదాసు తెలిపారు. హైదరాబాద్ మేత్రాసనం అగ్ర పీఠాధిపతి కార్డినల్ పూల ఆంతోని, గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య ముఖ్యఅతిథులుగా హాజరై జపమాల, దివ్య బలి పూజ నిర్వహిస్తారని చెప్పారు. దివ్య బలి పూజ అనంతరం ప్రేమ విందు జరుగుతుందని, కుటుంబసభ్యులతో హాజరవ్వాలని కోరారు.